Website: www.subhatelangana.in

RNI-TELTEL/2017/72695

సోమవారం
23 సెప్టెంబర్ 2024

ఎడిటర్:
నాగళ్ళ చంద్రశేఖర్

సంపుటి : 8
సంచిక : 137
పేజీలు : 6
వెల : 3/-

# శుభ తెలంగాణ

ఉన్నది ఉన్నట్లుగా రాసే తెలుగు దినపత్రిక

మేడ్చల్

Circulated at Hyderabad, Rangareddy, Warangal, Karimnagar, Khammam, Nalgonda, Nizambad, Medak, Adilabad, Mahaboobnagar

## పాక్‌తో చర్చల ప్రసక్తి లేదు



- నేషనల్ కాంగ్రెస్ కాంగ్రెస్ సహా వివిధ విపక్షాలు డిమాండ్ చేస్తున్నట్టుగా 370 అధికరణ రద్దును తిరిగి పునరుద్ధరించేది లేదు
- 370 అధికరణను ఎవరూ వెనక్కి తేలేరు
- ఇప్పుడు ఐంకర్లు అవసరం లేదు
- బుల్లెట్లు కాల్చడానికి ఎవరికీ దమ్ము సరిపోదు"
- కేంద్ర హోం మంత్రి అమిత్‌షా

## దేశంలో మహిళలపై నేరాలు పెరుగుతున్నాయి

- బీఎస్పీ అధ్యక్షురాలు, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం మాయావతి
- పెరుగుతున్న నేరాల సంఘటనలపై ప్రత్యారోపణలతో సంకుచిత రాజకీయాలకు పాల్పడడం చాలా బాధాకరం
- మహిళల భద్రత, గౌరవానికి సంబంధించి ప్రభుత్వాల ఉద్దేశాలు, విధానాల్లో తీవ్ర లోపం ఉన్నదా?
- మహిళలపై నేరాల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం, పోలీసుల ప్రమేయం పరిస్థితిని మరింత తీవ్రంగా మారుస్తున్నది





### దాదాపు 7 కోట్లకు చేరిన అటల్ పెన్షన్ యోజన సబ్‌స్క్రైబర్ల సంఖ్య


- ఈ పథకం ప్రారంభమైన నాటి నుంచి 6.9 కోట్ల మంది అటల్ పెన్షన్ యోజన పథకం లబ్ధిదారులుగా మారారు.
- తక్కువ ఖర్చుతో పింఛను సదుపాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది
- ఈ పథకం లబ్ధిదారులకు 60 ఏళ్ల దాటాక నెలకు రూ.1000 నుంచి రూ.5 వేల వరకూ పెన్షన్ అందుతుంది.
- కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్

## ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌పై
# వెనక్కి వెళ్లలేం

బాధితులకు నష్టపరిహారం పెంచే యత్నం చేస్తా

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలో సమస్యలన్నీ పరిష్కరిస్తా

సీపీఎం ప్రతినిధి బృందంతో సీఎం రేవంత్




**శుభ తెలంగాణ హైదరాబాద్**

రీజినల్ రింగు రోడ్డు అలైన్‌మెంట్ మార్పుపై నిర్ణయం జరిగిపోయిందని, వెనక్కి వెళ్లడం కష్టమని సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆర్ఆర్ఆర్ భూ సేకరణను ముందుగా నిర్ణయించిన అలైన్‌మెంట్ ప్రకారమే చేపట్టాలంటూ సీపీఎం ప్రతినిధులు బీవీ రాఘవులు, ఎస్ వీరయ్య, సీతారాములు, జూలకంటి రంగారెడ్డి తనను సచివాలయంలో కలిసిన సందర్భంగా రేవంత్ తన నిర్ణయాన్ని - మిగతా3లో



## కాంగ్రెస్ ప్రభుత్వంపై
# ప్రజల్లో వ్యతిరేకత

- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- అమృత్ పథకం అక్రమాలపై ఫిర్యాదు చేస్తే కేంద్రం విచారిస్తుంది
- కాంగ్రెస్ పార్టీ అవినీతిలో కోరుకుపోయింది
- కొంతమంది కాంగ్రెస్ మంత్రులు ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడుతున్నారు
- ఎంఐఎం పార్టీకి కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతుంది
- హైడ్రాకి వ్యతిరేకం కాదని నిస్పాక్షికంగా కూల్చివేతలు జరగాలి
- తానెప్పుడు మదర్సాల గురించి మాట్లాడినా ఓవైసీ తెగ బాధపడిపోతారు
- ఉగ్రవాదులతో సంబంధమున్న ఓ టెర్రరిస్టు ఓవైసీ కాలేజీలో ఫ్యాకల్టీగా పనిచేస్తూ దొరికింది నిజం కాదా?

**శుభ తెలంగాణ కరీంనగర్ /హైదరాబాద్**

అతి తక్కువ కాలంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం పై ప్రజల్లో వ్యతిరేకత వచ్చిందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు. కరీంన గర్‌లో బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. బీజేపీ రాష్ట్ర - మిగతా3లో

# 24 ఇళ్లు నేలమట్టం

2 వారాల అనంతరం తిరిగి రంగంలోకి హైడ్రా
అమీన్‌పూర్‌లోని పటేల్‌గూడలో కూల్చివేత





- కిష్టారెడ్డిపేటలో 3 బహుళ అంతస్తుల భవనాలు
- ప్రభుత్వ భూమిలోని నిర్మాణాలపై చర్యలు
- కూకట్‌పల్లి నల్లచెరువులో 16 షెడ్ల తొలగింపు
- అధికారులతో బాధితుల వాగ్వాదం.. తీవ్ర ఆవేదన
- నోటీసులు ఇచ్చాకే కూల్చివేస్తున్నాం: రంగనాథ్

## నాలుగు రోజులు భారీ వర్షాలు..

ఎల్లో అలెర్ట్ జారీ చేసిన ఐఎండీ

పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశాలు

**శుభ తెలంగాణ హైదరాబాద్**

తెలంగాణలో రాగల నాలుగురోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. ఈ క్రమంలో ఆయా జిల్లాలకు ఎల్లో అలెర్ట్‌ని జారీ చేసింది. ఆదివారం భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, నల్గొండ, సూర్యాపేట, రంగారెడ్డి, వికారాబాద్, మహబూబ్‌నగర్, - మిగతా3లో



## సింగరేణి కార్మికులకు ఇచ్చింది బోనస్ కాదు.. బోగస్

- కార్మికుల కష్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటుంది
- పండుగ వేళ.. ప్రభుత్వం కార్మికుల పొట్ట కొడుతోంది
- ప్రతి కార్మికుడికి 3.70 లక్షల రూపాయలు రావాలి
- కానీ కేవలం 796 కోట్ల రూపాయలు మాత్రమే కార్మికులకు పంచుతున్నారు.'
- సింగరేణి ప్రాంతంలోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన కార్మిక లోకానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బహుమానమా ఇది
- కాంగ్రెస్ ప్రభుత్వంపై కేటీఆర్ ధ్వజం



**శుభ తెలంగాణ హైదరాబాద్**

నిన్న సింగరేణి కార్మికులకు కాంగ్రెస్ ఇచ్చింది దసరా బోనస్ కాదు అది బోగస్ అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. కార్మికుల కష్టాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం దోచుకుంటుందని మండిపడ్డారు. పండుగ వేళ.. ప్రభుత్వం కార్మికుల పొట్ట కొడుతోందని అన్నారు. హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఆదివారం నిర్వహించిన ప్రెస్‌మీట్‌లో కేటీఆర్ మాట్లాడారు. సింగరేణి లాభాల బోనస్ అంతా బోగస్‌గా మారిపోయిందని అన్నారు. ప్రతి సింగరేణి కార్మికుడు కనీసం లక్షా 80వేలు నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ' సింగరేణి నికర లాభం రూ.4701 కోట్లలో.. న్యాయంగా 33 శాతం వాటా 1,551 కోట్లు కావాలి.. ప్రతి కార్మికుడికి 3.70 లక్షల రూపాయలు రావాలి. కానీ కేవలం 796 కోట్ల రూపాయలు మాత్రమే కార్మికులకు పంచుతున్నారు.' అని వివరించారు. ఇస్తే మొత్తంగా లాభాల్లో వాటా ఇవ్వాలి, లేకపోతే మేము ఇచ్చేది కేవలం 16.9% మాత్రమే అని ఒప్పుకోవాలని సూచించారు. కానీ 33% అంటూ - మిగతా3లో

# నెయ్యి సరఫరాదారులపై చర్యలకు సిద్ధం




**విజయవాడ :** తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాల్లో జంతువుల కొవ్వుల అవశేషాలు వెలుగు చూశాయని, అక్రమాలు జరిగాయంటూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండు రోజుల క్రితం ఎన్డీఏ వంద రోజుల పాలన సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో తీవ్ర ఆరోపణలు చేశారు. టీటీడీకి సరఫరా అవుతున్న నెయ్యి నాణ్యతపై నిర్వహించిన పరీక్షల్లో దిగ్భ్రాంతి పరిచే వాస్తవాలు వెలుగు చూసినట్టు గురువారం టీడీపీ అధికార ప్రతినిధి ఆనం వెంకటరమణారెడ్డి నివేదికలను విడుదల చేశారు.జూలై నెల మొదటి వారంలో తిరుమలలో సేకరించిన నెయ్యి శాంపిల్స్ ఆధారంగా గుజరాత్‌కు చెందిన నేషనల్ డైరీ డెవలప్‌మెంట్ ఫెడరేషన్ అనుబంధ కాఫ్‌లో తిరుమలలో సేకరించిన నెయ్యి పరీక్షలు జరిపారు. దీనిపై కలవరపెట్టే విషయాలు వెలుగు చూశాయి. నెయ్యి తయారీకీ అవసరమైన ఎస్ వాల్యూ 95.8-104.32 శాతం మధ్య ఉండాల్సి ఉండగా టీటీడీ నుంచి సేకరించిన శాంపిల్స్‌లో 20శాతం లోపే ఉంది. జూలైలోనే ఈ నివేదిక టీటీడీకి అందింది. దీని ఆధారంగా నెయ్యి సరఫరాదారులపై టీటీడీ చర్యలు కూడా తీసుకున్నట్టు తెలుస్తోంది. మరోవైపు రాష్ట్రంలో ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే కర్ణాటక నుంచి నందిని డైరీ నుంచి నెయ్యి సరఫరాను పునరుద్ధరించారు.ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు తిరుమల శ్రీవారి ప్రసాదాల తయారీలో వినియోగించే నెయ్యిలో జంతువుల కొవ్వుతో పాటు, ఇతర మార్గాల్లో కల్తీ జరిగిందని స్పష్టం చేశారు. కొన్నేళ్లుగా టీటీడీకి ప్రైవేట్ సంస్థలతో పాటు, సహకార రంగంలో ఉన్న డైరీలు అందిస్తున్న నెయ్యి ధరలను చూస్తే ఆ ధరలతో నెయ్యి సరఫరా ఎలా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ప్రస్తుతం తిరుమలకు సరఫరా చేస్తున్న నెయ్యిని రూ.470 కు నుంచి కొనుగోలు చేస్తున్నారు. టెండర్లలో ఎల్1గా నిలచిన కంపెనీల నుంచి ఎలాంటి పరీక్షలు లేకుండా నేతిని టీటీడీ కొనుగోలు చేస్తోంది. టెండర్ దక్కించుకున్న సంస్థలు ఇతర ప్రాంతాల నుంచి సేకరించి వాటిని టీటీడీకీ సరఫరా చేస్తున్నట్టు ప్రైవేట్ డైరీ సంస్థలు చెబుతున్నాయి. కొన్నేళ్ల క్రితం విజయవాడ నుంచి ట్యాంకర్లలో నకిలీ నెయ్యిని తిరుమలకు సరఫరా చేస్తుండగా టీటీడీ విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. అప్పట్లో ఈ వ్యవహారాన్ని గుట్టు చప్పుడు కాకుండా మాఫీ చేశారు.సాధారణంగా ఆవు నెయ్యిని తయారు చేయాలంటే కిలో నెయ్యి తయారీకి 25 లీటర్ల నుంచి 40 లీటర్ల వరకు పాలు అవసరం అవుతాయి. పాలలో ఉండే వెన్న శాతం ఆధారంగా వెన్న లభ్యత ఉంటుంది. ఆవు పాలలో నెయ్యి శాతం గరిష్టంగా 4- 6 శాతానికి మించి ఉండే అవకాశాలు ఉండవు. దక్షిణాది రాష్ట్రాల్లో కర్ణాటక మినహా మిగిలిన రాష్ట్రాల్లో ఆవుల పెంపకం పెద్దగా ఉండదు. ఏపీలో చిత్తూరు, రాయలసీమ జిల్లాలో కూడా ఆవుల పెంపకం ఉంది. టీటీడీ రోజువారీ అవసరాలతో పాటు లడ్డూ ప్రసాదాల తయారీకి టన్నుల కొద్ది నెయ్యిని వినియోగిస్తారు.దేశీయ పద్ధతుల్లో శుద్ధమైన ఆవు నెయ్యిని తయారు చేయాలంటే కిలో నెయ్యికి లీటరు ఆవుపాలను లీటరుకు రూ.65రుపాయలకు కొనుగోలు చేస్తే రూ. 1625 నుంచి రూ.2275 ఉత్పత్తి వ్యయం అవుతుంది. ఒక్కోసారి కిలో నెయ్యి తయారీకి 40లీటర్ల పాలు కూడా అవసరం అవుతాయని డైరీ నిర్వాహకులు చెబుతున్నారు. పాల సేకరణ, వెన్నను తీసి, నెయ్యి తయారు చేసే క్రమంలో ఉత్పత్తి దారుడికి అయ్యే ఖర్చును కలుపుకుంటే లీటరు ధర వెన్న శాతం ఆధారంగా కిలో నెయ్యి ధర రూ.2వేలకు తక్కువ ఉండదు. అత్యంత ఖరీదైన ఆవు నెయ్యిని ఎల్1 టెండర్‌లో గత ప్రభుత్వ హయంలో సగటున రూ.400కు కేటాయించారు. ప్రస్తుతం నందిని సంస్థ నుంచి రూ.470 కొనుగోలు చేస్తున్నారు. అంత ఖరీదైన ఆవునెయ్యిని టన్నులకు టన్నులు టీటీడీకి రూ.450-500 ఎలా సరఫరా చేయగలుగుతారనే ప్రశ్నకు సహేతుకమైన సమాధానాలు ఎవరి వద్ద లేవు. సీఎం ఆరోపణల నేపథ్యంలో టీటీడీ మాజీ ఛైర్మన్ వైవీ సుబ్బారెడ్డి ఇచ్చిన వివరణలో కూడా కొన్ని వివరాలు బయటపెట్టారు. శ్రీవారి నైవేద్యాల కోసం నిత్యం 60కేజీల స్వచ్ఛమైన నెయ్యిని దాతల సహకారంతో గుజరాత్, రాష్ట్రాల్లోని గోశాల నుంచి లక్ష రుపాయల వ్యయంతో కొనుగోలు చేస్తున్నట్టు చెప్పారు. రోజుకు 60కిలోలను లక్ష రుపాయల చొప్పున నెలకు రూ.30లక్షలు ఖర్చు చేస్తున్నట్టు సుబ్బారెడ్డి స్వయంగా వెల్లడించారు. ఆ లెక్కల్లో కిలో ధర రూ.1667 పలుకుంది. స్వామి వారి నైవేద్యానికి వినియోగించే నెయ్యి ధర రూ.1667 ఉన్నపుడు, లడ్డూ ప్రసాదాలకు వాడే నెయ్యి కిలో రూ.470కు ఎలా వస్తుందనేది మరో ప్రశ్న. స్వామి వారి నైవేద్యంలలో వాడే నెయ్యి, ప్రసాదాల్లో వాడే నెయ్యి ఒక్కటి కాదని వైవీ సుబ్బారెడ్డి స్వయంగా అంగీకరించినట్టైంది.వైసీపీ ప్రభుత్వంలో ట్యాంకర్ల ద్వారా కొనుగోలు చేసే నెయ్యిని ట్యాంకర్లలో సరఫరా చేస్తే కిలో రూ.390కు, 15లీటర్ల క్యాన్లలో కొనుగోలు చేస్తే రూ.409 చొప్పున సేకరించారు. సగటున రూ.400 చొప్పున కిలో నెయ్యి కొనుగోలు చేశారు.గత ఏడాది టీటీడీ నెయ్యి కొనుగోళ్ల కోసం రూ.207 కోట్లన ఖర్చు చేసింది. కిలో రూ.400చొప్పున ఏడాదిలో దాదాపు 51,75,000 కేజీల నెయ్యిని పలు సంస్థల నుంచి కొనుగోలు చేశారు. అంటే సగటున రోజుకు 14,178కేజీల నెయ్యిని ప్రసాదాల తయారీలో వినియోగించారు. ఇందుకోసం 5175 టన్నుల నెయ్యిని రూ.207 కోట్లను టీటీడీ వెచ్చించింది. టీటీడీకి సరఫరా చేసే నెయ్యి కల్తీ వ్యవహారంలో పైకి కనిపించని కోణాలు చాలా ఉన్నాయనే ఆరోపణలు ఉన్నాయి. దేశంలో స్వచ్ఛమైన ఆవు నెయ్యి లభ్యత అంత సులువు కాదని డైరీ రంగంలో పనిచేసే వారు చెప్పే మాట... రాయలసీమలో ఆవుల ద్వారా పాడిపరిశ్రమ నిర్వహించే డైరీ నిర్వాహకులు గతంలో టీటీడీని నెయ్యి సరఫరాకు సంప్రదించినా అప్పట్లో తమకు అవకాశం ఇవ్వలేదని గుర్తు చేశారుదేశంలో కర్ణాటక డైరీ ఫెడరేషన్‌తో పాటు కొన్ని ప్రైవేట్ సంస్థలు మాత్రమే ఆవుపాలను సేకరించి ఉత్పత్తులు చేస్తున్నాయి. 4 నుంచి 6శాతం మాత్రమే కొవ్వు ఉండే ఆవు పాల నుంచి నెయి తీయాలంటే 15 టన్నుల నెయ్యి కోసం 6 లక్షల లీటర్ల పాలు వాడాల్సి ఉంటుందని డైరీ నిర్వాహకులు చెబుతున్నారు. అంటే సగటున ప్రతి కిలో నెయ్యికి 40లీటర్ల పాలు వినియోగించాల్సి ఉంటుంది. టీటీడీ లడ్డూ ప్రసాదాల కోసం కొనే నెయ్యిలో ఖచ్చితంగా కల్తీ జరగడానికి అవకాశం ఉంటుందని చిత్తూరుకు చెందిన ప్రైవేట్ డైరీ నిర్వాహకుడు వివరించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలపై చేసిన వ్యాఖ్యల్లో లాభనష్టాలపై కూడా విస్తృత చర్చ జరుగుతోంది. రాజకీయ కోణంలో చూస్తే గత ప్రభుత్వాల హయంలో జరిగిన పొరపాట్లు తమకు చుట్టుకోకుండా చంద్రబాబు జాగ్రత్తపడ్డారనే వాదనలు ఉన్నా, అంతకు మించి భక్తుల మనస్సులో సందేహాలను నాటాయి. ఇకపై తిరుమల శ్రీవారి లడ్డూ ప్రసాదాలను భక్తులు అనుమానపు చూపులు చూసే ప్రమాదం ఉంటుంది. ఆవుకొవ్వు, పందికొవ్వు అంటూ రాజకీయ వ్యాఖ్యలు స్వామి వారి లడ్డూ ప్రసాదాలపై సామాన్య ప్రజల్లో ఉండే భక్తిభావంపై ప్రభావం చూపే అవకాశాలు లేకపోలేదు. మరోవైపు గుజరాత్ ల్యాబరేటరీ రిపోర్టులను బయటపెట్టకపోతే భవిష్యత్తులో వైసీపీ వాటినే తమపై ప్రయోగించి ఉండేదనే అనుమానం టీడీపీ వర్గాల్లో ఉంది. కోట్లాది మంది భక్తుల కొలిచే కలియుగ ప్రత్యక్ష దైవం చుట్టూ ఏపీలో జరుగుతున్న రాజకీయం భక్తుల మనోభావాలతో సంబంధం లేకుండా సాగుతోంది.తిరుమల వెళ్లిన భక్తుల్ని ఇతరులు దేవుడి కంటే ముందు లడ్డూ ప్రసాదం గురించే అడుగుతారు. గత ప్రభుత్వ హయంలో జరిగిన తప్పుల్ని ఎత్తి చూపడానికి ఉపయోగపడినా భక్తుల హృదయాల్లో అంతకుమించి అనుమానపు బీజాలు నెలకొల్పడానికి ముఖ్యమంత్రి వ్యాఖ్యలు కారణమవుతాయనే అభిప్రాయం ఉంది.

# రాష్ట్ర చైతన్య సభ విజయవంతం చేద్దాం

## దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కాశపోగు జాన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డేవిడ్

## చేయి చేయి కలుపుదాం దళిత జర్నలిస్టులం ఏకమైదం

**(శుభ తెలంగాణ/హైదరాబాద్) :** తెలంగాణ రాష్ట్రంలో దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర చైతన్య సభ సెప్టెంబర్ 27 శుక్రవారం రవీంద్ర భారతిలో నిర్వహించడం జరుగుతుందని దళిత జర్నలిస్టు ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కాశ పోగు జాన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డేవిడ్ ఒక ప్రకటనలో తెలియజేసినారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దళిత జర్నలిస్టులకు ప్రతి ఒక్కరి కి అక్రిడేషన్ సౌకర్యం కల్పించాలని దళిత జర్నలిస్టులకు అభయస్థం పథకం కింద 12 లక్షలు ఇవ్వాలని ప్రతి జిల్లాకు అక్రిడేషన్ కమిటీలో స్థానం కల్పించాలని పత్రిక నిర్వహిస్తున్న జర్నలిస్టులకు ప్రభుత్వ ప్రకటనలు ఇవ్వాలని ప్రతి దళిత జర్నలిస్టులకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయాలని సీనియర్ దళిత జర్నలిస్టులకు నామినేటెడ్ పదవులు కేటాయించాలని దళిత జర్నలిస్టులు అకాల మరణం చెందితే పది లక్షల ఎక్స్రేషన్ కల్పించాలని ప్రతి దళిత జర్నలిస్టులపై ఎలాంటి దాడులు జరగకుండా రక్షణ కల్పించాలని దళిత జర్నలిస్టులకు నిరుద్యోగ భృతి 5000 రూపాయలు ఇవ్వాలని కోరుతూ దళిత జర్నలిస్టు ఫోరం ఆధ్వర్యంలో రాష్ట్ర చైతన్య సభ రవీంద్ర భారతిలో సెప్టెంబర్ 27వ తారీకు శుక్రవారం రోజు నిర్వహించడం జరుగుతుందని మన హక్కులను సాధించుట కొరకు ప్రతి ఒక్క దళిత జర్నలిస్టు వేలాదిగా తరలి రావాలని ఈ చైతన్య సభకు హాజరై విజయవంతం చేయవలసిందిగా కోరుతున్నా జర్నలిస్టు ఫోరం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షులు కాశపోగు జాన్ కార్యదర్శి డేవిడ్ తెలియజేసినారు.



## నన్ను అవినీతిపరుడిగా నిరూపించేందుకు మోదీ కుట్ర పన్నారు

**న్యూఢిల్లీ:** తనను అవినీతిపరుడిగా నిరూపించేందుకు ప్రధాని మోదీ కుట్ర పన్నారని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అధినేత, ఢిల్లీ మాజీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ఆరోపించారు. తనపై గెలవాలంటే తన నిజాయితీపై దాడి చేయాలని మోదీ భావించారంటూ మండిపడ్డారు. ఆదివారం ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద జరిగిన 'జనతాకీ అదాలత్' కార్యక్రమంలో అరవింద్ కేజ్రీవాల్ మాట్లాడారు. 'ప్రధాని నరేంద్ర మోదీ మాపై కుట్ర పన్నారు. నన్ను, (ఆప్ నేత) మనీష్ సిసోడియా అవినీతిపరుడని నిరూపించేందుకు కుట్ర పన్నారు. మా ప్రతిష్టను దెబ్బతీసేందుకు ప్రయత్నించారు' అని అన్నారు. కాగా, తాను గత పదేళ్లుగా నిజాయితీతో ఢిల్లీ ప్రభుత్వాన్ని నడిపానని అరవింద్ కేజ్రీవాల్ తెలిపారు. తనపై గెలవాలంటే తన నిజాయితీపై దాడి చేయాలని ప్రధాని మోదీ భావించారని విమర్శించారు. 'సీఎం కుర్చీపై ఆకలి లేకపోవడం వల్లే రాజీనామా చేశా. డబ్బు సంపాదించడానికి కాదు, దేశ రాజకీయాలను మార్చేందుకే వచ్చా' అని అన్నారు. సీఎం పదవికి రాజీనామా చేసిన తాను మరికొద్ది రోజుల్లో సీఎం అధికార నివాసం నుంచి వెళ్లిపోతానని తెలిపారు. పదేళ్లపాటు సీఎంగా ఉండి కూడా ఢిల్లీలో తనకు సొంత ఇల్లు లేదన్నారు. మరోవైపు బీజేపీ తనను అవినీతిపరుడని అనడంతో బాధపడ్డానని కేజ్రీవాల్ ఆవేదన వ్యక్తం చేశారు. 'అరవింద్ కేజ్రీవాల్ నిజాయితీ లేనివాడైతే ప్రజలకు ఉచిత విద్యుత్తు, మహిళలకు బస్సు చార్జీలు ఉచితంగా ఇచ్చేవాడా? పిల్లల కోసం స్కూళ్లు కట్టించేవాడా? ఆసుపత్రుల్లో వైద్యం ఉచితంగా అందించేవాడా? ' అని ప్రశ్నించారు.

## ఆ ఉద్యోగుల ఈపీఎఫ్ ఖాతాల్లో నెల వేతనం జమ



కేంద్ర బడ్జెట్‌లో ప్రకటించినట్టుగానే కొత్తగా ఉద్యోగాల్లో చేరే వారికి ఒక నెల వేతనాన్ని వారి ఈపీఎఫ్ ఖాతాల్లో జమ చేయనున్నట్టు కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయ తెలిపారు. ఆ ప్రకారం ఒక ఉద్యోగి ఖాతాలో గరిష్ఠంగా రూ.15 వేలు జమకానున్నాయి. ఇక తెలంగాణలో 36,018 సంస్థల కింద 47.96 లక్షల మంది చందాదారులు, 4.54 లక్షల మంది పెన్షన్ తీసుకునేవాళ్లు ఉన్నట్లు కేంద్ర మంత్రి చెప్పారు. కేంద్రమంత్రి మాండవీయ హైదరాబాద్ బర్కత్‌పురాలోని పీఎఫ్ కార్యాలయాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా ఉద్యోగుల భవిష్య నిధి సంస్థ, ఎంప్లాయీస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్‌పై మన్‌సుఖ్ మాండవీయ బుధవారం సమీక్ష నిర్వహించారు. ఈపీఎఫ్ తెలంగాణ జోన్‌లో ఏటా రూ.7,797 కోట్ల చెల్లింపులు జరుగుతున్నాయని చెప్పారు. యువ ఉద్యోగుల కోసం కేంద్రప్రభుత్వం ఈ ఏడాది బడ్జెట్‌లో ఎంప్లాయిమెంట్ లింక్డ్ ఇన్సెంటివ్ పథకాన్ని ప్రకటించిందని గుర్తుచేశారు. ఈ పథకం కింద మొదటిసారి ఉద్యోగంలో చేరే యువతీ యువకులకు ఒక నెల వేతనాన్ని ప్రభుత్వం సబ్సిడీ రూపంలో అందించనుంది.

## 'కొడుకు ఫీజు చెల్లించడానికి అడుక్కోవలసి వచ్చింది' మనీష్ సిసోడియా ఆవేదన



**న్యూఢిల్లీ:** తన కొడుకు కాలేజీ ఫీజు చెల్లించడానికి సహాయం కోసం తాను అడుక్కోవలసి వచ్చిందని ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) సీనియర్ నేత, ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీష్ సిసోడియా వాపోయారు. తన బ్యాంకు ఖాతాలో పది లక్షలు ఉన్నప్పటికీ ఈడీ ఫ్రీజ్ చేయడంతో ఈ దుస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం జంతర్ మంతర్ వద్ద జరిగిన 'జనతా కీ అదాలత్' సభలో మనీష్ సిసోడియా మాట్లాడారు. మద్యం పాలసీ కేసులో అరెస్ట్ చేసి ఏడాదిన్నరపాటు జైలులో ఉంచిన తనను అనేక విధాలుగా ఇబ్బందులకు గురి చేశారని తెలిపారు. 'నన్ను విచ్ఛిన్నం చేయడానికి వారు ప్రయత్నించారు. అరవింద్ కేజ్రీవాల్ నన్ను ఇరికించారని నాకు చెప్పారు. మనీష్ సిసోడియా పేరును అరవింద్ కేజ్రీవాల్ చెప్పారని కోర్టుకు తెలిపారు. కేజ్రీవాల్ పేరు చెబితే మీరు బయటపడతారని జైలులో నాతో అన్నారు' అని మండిపడ్డారు. కాగా, బీజేపీలోకి మారడానికి తనకు చాలా ఆఫర్లు వచ్చాయని సిసోడియా తెలిపారు. పార్టీ మారకపోతే తనను జైలులో చంపేస్తారని కూడా బెదిరించారని ఆయన ఆరోపించారు. 'నా గురించి ఆలోచించమని, రాజకీయాల్లో ఎవరూ ఎవరి గురించి ఆలోచించరని నాకు చెప్పారు. నా కుటుంబం గురించి, అనారోగ్యంతో ఉన్న నా భార్య, కాలేజీలో చదువుతున్న నా కుమారుడి గురించి ఆలోచించమని నాకు చెప్పారు' అని విమర్శించారు. అయితే రాముడి నుంచి లక్ష్మణుడ్ని దూరం చేసేందుకు మీరు ప్రయత్నిస్తున్నారని, ప్రపంచంలో ఏ రావణుడికి ఇలా చేసే శక్తి లేదని తాను చెప్పానన్నారు. మరోవైపు 26 ఏళ్లుగా అరవింద్ కేజ్రీవాల్ తన సోదరుడు, రాజకీయ గురువు అని మనీష్ సిసోడియా అన్నారు. ఆప్‌ను విచ్ఛిన్నం చేసేందుకే తనను, పార్టీ సహచరులను అరెస్టు చేశారని ఆయన ఆరోపించారు. అయితే తమతోపాటు పార్టీని కూడా వారు విచ్ఛిన్నం చేయలేకపోయారని ఎద్దేవా చేశారు. అరవింద్ కేజ్రీవాల్ మాదిరిగానే తాను కూడా ఎన్నికల్లో ప్రజా తీర్పు తర్వాతే ఢిల్లీ ప్రభుత్వంలో బాధ్యతలు చేపడతానని సిసోడియా స్పష్టం చేశారు.

## దాదాపు 7 కోట్లకు చేరిన అటల్ పెన్షన్ యోజన సబ్‌స్క్రైబర్ల సంఖ్య



ఇంటర్నెట్ డెస్క్: వృద్ధాప్యంలో ఆర్థికంగా ఆసరా ఇచ్చే అటల్ పెన్షన్ యోజన పథకం సబ్‌స్క్రైబర్ల సంఖ్య 6.9 కోట్లుకు చేరినట్టు కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తాజాగా పేర్కొన్నారు. పెన్షన్ ఫండ్ నిధి రూ.35,149 కోట్లుగా ఉన్నట్టు వెల్లడించారు. "2015లో ఈ పథకం ప్రారంభమైన నాటి నుంచి 6.9 కోట్ల మంది అటల్ పెన్షన్ యోజన పథకం లబ్ధిదారులుగా మారారు. పెన్షన్ ఫండ్ రూ.35,149కి చేరింది" అని ఎన్‌పీఎస్ వాత్సల్య పథకం ప్రారంభోత్సవంలో మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు.

తక్కువ ఖర్చుతో పింఛను సదుపాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం లబ్ధిదారులకు 60 ఏళ్లు దాటాక నెలకు రూ.1000 నుంచి రూ.5 వేల వరకూ పెన్షన్ అందుతుంది. లబ్ధిదారులు పథకంలో పెట్టిన పెట్టుబడిని బట్టి వచ్చే పింఛను ఆధార పడి ఉంటుంది. పెన్షన్ సబ్‌స్క్రైబర్ మరణించిన పక్షంలో వారి భాగస్వామికి ఈ పింఛను అందజేస్తారు. సబ్‌స్క్రైబర్‌తో పాటు వారి జీవితభాగస్వామి కూడా మరణిస్తే వారి సంతానానికి పెన్షన్ కార్పస్‌ను పూర్తిగా అందజేస్తారు.

## 'దేశంలో మహిళలపై నేరాలు పెరుగుతున్నాయి'



**లక్నో:** దేశంలో మహిళలపై నేరాలు పెరుగుతున్నాయని బహుజన్ సమాజ్ పార్టీ (బీఎస్పీ) అధ్యక్షురాలు, ఉత్తరప్రదేశ్ మాజీ సీఎం మాయావతి ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వాల నిర్లక్ష్యంపై మండిపడ్డారు. అలాగే మహిళల భద్రత పట్ల ప్రభుత్వ విధానాలను ఆమె ప్రశ్నించారు. ఉత్తరప్రదేశ్, బెంగాల్, ఒడిశా, కర్ణాటక సహా దేశ వ్యాప్తంగా మహిళలపై నేరాలు పెరుగుతున్నాయని మాయావతి ట్వీట్ చేశారు. అయితే పెరుగుతున్న నేరాల సంఘటనలపై ప్రత్యారోపణలతో సంకుచిత రాజకీయాలకు పాల్పడడం చాలా బాధాకరమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో మహిళల భద్రత, గౌరవానికి సంబంధించి ప్రభుత్వాల ఉద్దేశాలు, విధానాల్లో తీవ్ర లోపం ఉన్నదా? అని ప్రశ్నించారు. అలా అయితే దీని గురించి తీవ్రంగా ఆలోచించాల్సిన సమయం ఇదేనని ఎక్స్‌లో ఆదివారం పోస్ట్ చేశారు. కాగా, మహిళలపై నేరాల పట్ల ప్రభుత్వాల నిర్లక్ష్యం, పోలీసుల ప్రమేయం పరిస్థితిని మరింత తీవ్రంగా మారుస్తున్నదని మాయావతి విమర్శించారు. ఈ నిర్లక్ష్యాన్ని విడిచిపెట్టాలని, నిష్పక్షపాతంగా, సీరియస్‌గా వ్యవహరించడం ప్రతి ఒక్కరికీ చాలా ముఖ్యమని సూచించారు. తద్వారా ఇలాంటి ఘోరమైన నేరాల వల్ల రాష్ట్రం, దేశం అపఖ్యాతి కాకుండా కాపాడుకోవచ్చని వరుస ట్వీట్లలో పేర్కొన్నారు.

## పాక్‌తో చర్చల ప్రసక్తి లేదు



**రాజౌరి:** ఉగ్రవాదాన్ని అంతమొందించేంత వరకూ పాకిస్థాన్‌తో చర్చల ప్రసక్తే లేదని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా అన్నారు. నేషనల్ కాంగ్రెస్ కాంగ్రెస్ సహా వివిధ విపక్షాలు డిమాండ్ చేస్తున్నట్టుగా 370 అధికరణ రద్దును తిరిగి పునరుద్ధరించేది లేదన్నారు. జమ్మూకశ్మీర్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా నౌషెరాలో ఆదివారంనాడు జరిగిన ఎన్నికల ర్యాలీలో అమిత్‌షా మాట్లాడారు. "370వ అధికరణను తిరిగి తెస్తామని ఫరూక్ అబ్దుల్లా చెబుతున్నారు. ఫరూక్ సాహెబ్.. 370 అధికరణను ఎవరూ వెనక్కి తేలేరు. ఇప్పుడు బంకర్లు అవసరం లేదు. బుల్లెట్లు కాల్చడానికి ఎవరికీ దమ్ము సరిపోదు" అని అమిత్‌షా అన్నారు. షేక్ అబ్దుల్లా జెండాను తిరిగి తేవాలని వారనుకుంటున్నారని, కానీ జమ్మూకశ్మీర్‌లో ఎగిరేది మన త్రివర్ణ పతాకం మాత్రమేనని స్పష్టం చేశారు. 30 ఏళ్లుగా ఉగ్రవాదం కొనసాగుతోందని, 30 ఏళ్లలో 3000 రోజులు జమ్మూలో కర్ఫ్యూ విధించారని, 40 వేల మంది ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. మళ్లీ ఆ రోజులు ఎలా తేవాలనుకుంటున్నారో ఫరూక్ అబ్దుల్లానే చెప్పాలని అన్నారు. జమ్మూకశ్మీర్ తగలబడుతుంటే ఫరూక్ అబ్దుల్లా మాత్రం లండన్‌లో హాలిడేస్ గడిపారంటూ అమిత్‌షా విమర్శలు గుప్పించారు.

"పాకిస్థాన్‌తో చర్చలు జరపాలని వాళ్లు అంటున్నారు. అయితే ఉగ్రవాదం అంతమొందేంత వరకూ చర్చలు కుదరదని మేము అంటున్నాం. జైళ్ల నుంచి ఉగ్రవాదులను విడిచిపెట్టాలని వారు కోరుకుంటున్నారు. ఏ ఒక్క ఉగ్రవాదని కానీ, రాళ్లు రువ్వే వాళ్లను కానీ జైళ్ల నుంచి విడిచిపెట్టేది లేదు. బీజేపీ ఇందుకు హామీగా ఉంటుంది" అని అమిత్‌షా స్పష్టం చేశారు. కాంగ్రెస్, ఎన్సీ, పీడీపీలు గత 70 ఏళ్లుగా కొండ ప్రాంతాలలో ఉండేవారికి రిజర్వేషన్ హక్కులు లేకుండా చేసిందని, మోదీ మాత్రం కొండ ప్రాంతాల ప్రజలకు రిజర్వేషన్లు కల్పించేందుకు కృతనిశ్చయంతో ఉన్నారని చెప్పారు. జమ్మూకశ్మీర్‌లో తొలి విడత పోలింగ్ సెప్టెంబర్ 18న జరుగగా, 61.13 శాతం పోలింగ్ నమోదైంది. రెండో విడత పోలింగ్ ఈనెల 25న జరుగనుండగా, అక్టోబర్ 5న జరిగే మూడో విడతతో పోలింగ్ ముగుస్తుంది. అక్టోబర్ 8న ఎన్నికల ఫలితాలు వెలువడతాయి.

# 24 ఇళ్లు నేలమట్టం

**హైదరాబాద్ :** గణేశ్ నవరాత్రి ఉత్సవాల నేపథ్యంలో రెండు వారాలపాటు కూల్చివేతలకు తాత్కాలిక విరామం ప్రకటించిన హైడ్రా.. తిరిగి తన పనిని మొదలుపెట్టింది. చెరువులు, ప్రభుత్వ స్థలాల్లోని అక్రమ నిర్మాణాలపై మరోసారి కొరడా ఝుళిపించింది. ఏకకాలంలో కూకట్‌పల్లిలో, అమీన్‌పూర్ మునిసిపాలిటీలోని కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడలో ప్రభుత్వ భూముల్లోని నిర్మాణాలను నేలమట్టం చేసింది. కూకట్‌పల్లి శాంతినగర్‌లోని నల్లచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలో నాలుగు ఎకరాల విస్తీర్ణంలో, కిష్టారెడ్డిపేటలోని ఎకరంపైగా, పటేల్‌గూడలోని మూడు ఎకరాలకుపైగా విస్తీర్ణంలోని నిర్మాణాలను కూల్చివేసింది.
రెవెన్యూ, నీటి పారుదల, పట్టణ ప్రణాళిక విభాగం అధికారులతో కలిసి హైడ్రా బృందం కూల్చివేతలు చేపట్టింది. మూడు ప్రాంతాల్లోని 8ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఆక్రమణలు, భవనాలు తొలగించినట్టు హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ తెలిపారు. అయితే తమ సామాన్లను కూడా తీసుకునే సమయం ఇవ్వకుండా నిర్మాణాలు నేలమట్టం చేశారని బాధితులు లబోదిబోమన్నారు. అప్పులు చేసి చిన్న చిన్న వ్యాపారాలు చేసుకునే తాము హైడ్రా చర్యతో రూ.లక్షల్లో నష్టపోయి రోడ్డున పడ్డాయని ఆవేదన చెందారు.

**కూకట్‌పల్లిలో 16 షెడ్లు నేలమట్టం..**

ఎప్పటిలానే ఉదయం 5గంటలకే యంత్రాలతో సహా వివిధ విభాగాల అధికారులు, హైడ్రా బృందాలు ఆయా ప్రాంతాలకు చేరుకున్నారు. భారీ పోలీస్ బందోబస్తు మధ్య కూల్చివేతలు ప్రారంభించారు. కూకట్‌పల్లి శాంతినగర్‌లోని నల్లచెరువు 27 ఎకరాల విస్తీర్ణంలో ఉంది. ఈ చెరువు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లోని దాదాపు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో కొందరు వ్యక్తులు షెడ్లు నిర్మించి వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. కేటరింగ్ కోసం కిచెన్‌లు ఏర్పాటు చేశారు. ఇతరత్రా వ్యాపారాలూ సాగుతున్నాయి. వాటిలో పనిచేసే కార్మికులు ఉండేందుకు తాత్కాలిక నివాసాలు నిర్మించారు. ఫిర్యాదుల నేపథ్యంలో పలుమార్లు చెరువును పరిశీలించిన హైడ్రా అధికారులు.. నిర్మాణాలు ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్నట్టు నిర్ధారణకు వచ్చారు. సర్వే నంబర్లు 66, 67, 68, 69లోని 16 వాణిజ్య షెడ్లు, ప్రహరీ గోడలను నేలమట్టం చేశారు. ఇందులో ఐదు కేటరింగ్ షెడ్లు, మూడు ఫ్లెక్సీ ప్రింటింగ్ నిర్మాణాలు, రెండు టెంట్ హౌస్‌లు, ఆరు గోడౌన్లు ఉన్నాయి. ఒక టెంట్‌హౌసకు చెందిన గోడౌన్‌లో సామాను బయటకు తీయకుండానే నేలమట్టం చేశారు. కూల్చివేతలను ప్రారంభించగానే వ్యాపారులు, అక్కడ నివసించేవారు అడ్డుకునే ప్రయత్నం చేశారు. తమకు అన్యాయం చేయొద్దంటూ అధికారులకు మొర పెట్టుకున్నారు. అయితే అధికారులు వారికి నచ్చజెప్పేందుకు ప్రయత్నిస్తూనే కూల్చివేతలను కొనసాగించారు. కాగా, భారీ ఎత్తున కేటరింగ్ నిర్వహించే ఓ వ్యక్తి అక్కడే స్థిర నివాసం ఏర్పాటుచేసుకొని ఉంటున్నారు. కూల్చివేతల నేపథ్యంలో ఆయనతోపాటు కుటుంబ సభ్యులు రోదిస్తున్న వీడియోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారాయి. హైడ్రా అధికారులు మాత్రం.. నివాసేతర నిర్మాణాలను మాత్రమే కూల్చామని చెప్పారు. చెరువు స్థలాన్ని చెరబట్టిన కొందరు వ్యక్తులు.. అక్కడ షెడ్లు వేసుకొని వ్యాపారం చేస్తున్న పలువురి నుంచి అద్దె వసూలు చేస్తున్నారని తెలిపారు.

**కిష్టారెడ్డిపేటలో భవనాలు..**

సంగారెడ్డి జిల్లా అమీన్‌పూర్ మునిసిపాలిటీ పరిధిలోని కిష్టారెడ్డిపేట, పటేల్‌గూడ గ్రామాల్లో ప్రభుత్వ భూములను ఆక్రమించి చేపట్టిన నిర్మాణాలను హైడ్రా ఆదివారం కూల్చివేసింది. కిష్టారెడ్డిపేట గ్రామ పరిధిలో సర్వే నంబర్ 164లోని ప్రభుత్వ భూమిలో మూడు బహుళ అంతస్తుల భవనాలను హైడ్రా నేలమట్టం చేసింది. వీటిలో ఒకటి ఐదంతస్తుల భవనం కాగా, మరో రెండు భవనాలు నాలుగు అంతస్తులుగా నిర్మించారు. ఇవన్నీ నివాసేతర నిర్మాణాలు కాగా.. వీటిలో ఓ భవనాన్ని ఆస్పత్రి కోసం నిర్మించారు. అమీన్‌పూర్ మునిసిపాలిటీలో ఇటీవలే విలీనమైన కిష్టారెడ్డిపేటలో గ్రామ పంచాయతీ అనుమతులతో ఈ భవనాల నిర్మాణం చేపట్టారు. ఈ నిర్మాణాలపై గతంలోనే అనేకసార్లు ఆరోపణలు వచ్చాయి. ప్రభుత్వ సర్వే నంబర్‌లో నిర్మిస్తున్న భవనాలపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులు అందినా అధికారులు పట్టించుకోలేదు. రెవెన్యూ సిబ్బంది ఇక్కడ పలుమార్లు సర్వేలు నిర్వహించి మూడు భారీ భవనాలు ప్రభుత్వ భూమిలో ఉన్నాయని తేల్చడంతో హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. భవన యజమానులు తమవద్ద ఉన్న పత్రాలను, పంచాయతీ ఇచ్చిన అనుమతులను చూపించి కూల్చొద్దంటూ అధికారులను వేడుకున్నారు. పోలీసులు వారికి నచ్చచెప్పి అక్కడి నుంచి పంపించి వేశారు. వీటి కూల్చివేత ద్వారా దాదాపు ఎకరం స్థలాన్ని స్వాధీనం చేసుకున్నట్టు హైడ్రా అధికారులు తెలిపారు. మరోవైపు ఇటీవలే మునిసిపాలిటీలో విలీనమైన పటేల్‌గూడ పంచాయతీ పరిధిలోని బీఎసఆర్ కాలనీ పక్కన ప్రభుత్వ భూమిలో నిర్మించిన 24 వరుస ఇళ్లను కూల్చివేశారు. ప్రభుత్వ సర్వే నంబర్ విస్తరించి ఉన్న 12 సర్వే నంబర్ భూమి పక్కనే ఉన్న సర్వే నంబర్ 6లోని పట్టా భూమిలో బిల్డర్లు ఇళ్లను నిర్మించారు. సర్వేలో ప్రభుత్వ భూమి కబ్జా వ్యవహారం తేలడంతో హైడ్రా కూల్చివేతలకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందులో కొన్ని కుటుంబాలు నివాసం ఉంటుండగా వారికి హైడ్రా అధికారులు, పోలీసులు నచ్చజెప్పి ఖాళీ చేయించారు. కూల్చివేతల సమయంలో కొందరు భవనాల యజమానులు, బిల్డర్లు అధికారులతో వాగ్వాదానికి దిగారు.

# కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో వ్యతిరేకత

-మొదటిపేజీ తరువాయి

అధ్యక్షుడు కిషన్ రెడ్డి నాయకత్వంలో తెలంగాణ సభ్యత్వ నమోదు కార్యక్రమం వేగవంతంగా జరుగుతుందన్నారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్‌కి కేంద్రం కట్టుబడి ఉందన్నారు. అమృత్ పథకం అక్రమాలపై ఫిర్యాదు చేస్తే కేంద్రం విచారిస్తుందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అవినీతిలో కోరుకుపోయిందని, కొంతమంది కాంగ్రెస్ మంత్రులు ఎమ్మెల్యేలు అవినీతికి పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎంఐఎం పార్టీకి కాంగ్రెస్ ప్రభుత్వం భయపడుతుందన్నారు. హైడ్రాకి వ్యతిరేకం కాదని నిస్పాక్షికంగా కూల్చివేతలు జరగాలన్నారు. తిరుమల లడ్డు కల్తీ వివాదంపై కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా దృష్టి సారించారని అన్నారు. ఇలాంటివి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు.

**ఓవైసీ బ్రదర్స్‌పై బండి సంచలన వ్యాఖ్యలు**

ఓవైసీ బ్రదర్స్‌కు ఉగ్రవాదులతో సంబంధాలున్నాయని కేంద్ర సహాయ శాఖ మంత్రి బండి సంజయ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓల్డ్ సిటీ ఓవైసీ కనుసన్నల్లో ఉగ్రవాదుల అడ్డాగా మారిందని ఆరోపించారు. బీజేపీ సభ్యత్వ నమోదులో భాగంగా కరీంనగర్‌లో సంజయ్ ఆదివారం మాట్లాడారు. ఎంఐఎం పార్టీ మీటింగ్‌లో ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ శనివారం మాట్లాడుతూ.. బండి సంజయ్‌కు ఇస్లామోఫోబియా పట్టుకుందని, అందుకే మదర్సాలపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడుతున్నాడని అన్నారు. ఈ వ్యాఖ్యలకు బండి కౌంటర్ ఇచ్చారు.

**ఆయనది హిందూ ఫోబియా..**

తనకు ఇస్లామోఫోబియా లేదనీ, ఓవైసీ మాత్రం హిందూ ఫోబియాతో ఇబ్బంది పడుతున్నాడని సంజయ్ విమర్శించారు. పోలీసులను తీసేసి తనకు 15 నిమిషాలు టైమిస్తే, దేశంలోని హిందువులందరినీ నరికి చంపేస్తానని అన్న వ్యక్తికి హిందూఫోబియా ఉన్నట్లేగా? అని అన్నారు. ఓవైసీ సోదరులు, ఎంఐఎం నేతలు, కార్యకర్తలు ఎన్నడూ వందేమాతర గేయాన్ని ఆలపించలేదని, ఏ ఫోబియా వాళ్లను ఆపుతుందో చెప్పాలన్నారు. హిందువులు లౌకిక విలువలను పాటిస్తూ పీర్ల పండగ జరుపుకుంటారని.. ఏనాడైనా ఓవైసీ హిందువుల పండగల్లో పాల్గొన్నారా? బొట్టు పెట్టుకుని హిందూ దేవతలకు నమస్కరించారా? అని ప్రశ్నించారు.



**ఉగ్రవాద ఫ్యాక్టరీలవి..**


తానెప్పుడు మదర్సాల గురించి మాట్లాడినా ఓవైసీ తెగ బాధపడిపోతారని, ఉగ్రవాదులతో సంబంధమున్న ఓ టెర్రరిస్టు ఓవైసీ కాలేజీలో ఫ్యాకల్టీగా పనిచేస్తూ దొరికింది నిజం కాదా అని బండి ప్రశ్నించారు. "ఉత్తరప్రదేశ్‌లోని బిజ్‌నోర్ మదర్సాలో 9 మందిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారి దగ్గర మారణాయుధాలు దొరికాయి. అలాంటప్పుడు మదర్సాలు టెర్రరిస్టులను తయారు చేస్తున్నాయని అంటే ఓవైసీకి వచ్చిన బాధేంటి. దేశంలో ఎక్కడ ఉగ్రవాదులు పట్టుబడ్డా వారిలో కచ్చితంగా ఒక్కరికైనా పాత బస్తీతో సంబంధాలు ఉంటున్నాయి. ఓటు బ్యాంకు రాజకీయం కోసం ఉగ్రవాదులకు, రోహింగ్యాలకు ఎంఐఎం నేతలు ఆధార్, రేషన్ కార్డులిప్పించి ఆశ్రయం కల్పిస్తున్న మాట నిజం కాదా?. ప్రస్తుతం పాత బస్తీలోని కొన్ని ముస్లిం వర్గాలు ఓవైసీ కుటుంబ నియంతృత్వ ధోరణితో విసిగిపోయాయి. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రాగానే ఓల్డ్ సిటీని, న్యూ సిటీగా మార్చుతాం. ఓవైసీ కుటుంబానికి ప్రజలు గుణపాఠం చెప్పే రోజులు దగ్గర్లోనే ఉన్నాయి" అని బండి వ్యాఖ్యానించారు.

**హైడ్రాపై..**

భాగ్యనగరంలో సంచలనం సృష్టిస్తున్న హైడ్రాకు తాను వ్యతిరేకం కాదని బండి స్పష్టం చేశారు. అక్రమ కట్టడాలకు కారణమైన బీఆర్ఎస్ నేతలపై కూడా కఠిన చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కూల్చివేతల విషయంలో రాజకీయ ప్రలోభాలు ఉండకూడదని.. అక్రమ నిర్మాణాలు ఏ పార్టీవారివైనా కూల్చాల్సిందేనని డిమాండ్ చేశారు. అమృత్ పథకం అక్రమాలపై ఫిర్యాదు చేస్తే కేంద్రం విచారిస్తుందని తెలిపారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉండగా, ఓటుకు నోటుకు కేసు విచారణ జరపలేదని, దీనిని బట్టి కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల మధ్య లోపాయికారీ ఒప్పందం ఉందని బండి ఆరోపించారు.

# ప్రజలకు భారం కానున్న కరెంట్

**హైదరాబాద్ :** తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల సమయంలో అనేక ఉచిత హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం ఇప్పటికే ఫ్రీ బస్సు, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రూ.500లకే సిలిండర్ అమలు చేస్తోంది. రుణ మాఫీ చేసింది. దసరాకు రైతుభరోసా ఇచ్చే ఆలోచనలో ఉంది. అయితే తొలిసారి ప్రజలకు షాక్ ఇచ్చే అవకాశం కనిపిస్తోంది. విద్యుత్ చార్జీలు పెంచే యోచనలో ఉన్నట్లు తెలుస్తోంది.తెలంగాణలో విద్యుత్ చార్జీలు పెరుగుతాయా అంటే అవుననే అంటున్నాయి విద్యుత్ పంపిణీ సంస్థలు. తమకు ఇప్పటికే భారీగా లోటు ఉందని, ఈ నేపథ్యంలో చార్జీలు పెంచక తప్పదని పేర్కొంటున్నాయి. ఈ క్రమంలో 1,200 కోట్లు పూడ్చుకోవడానికి చార్జీలు పెంచాలని ప్రభుత్వానికి ప్రతిపాదించాయి. గృహ విద్యుత్ 300 యూనిట్లు దాటితే స్థిర చార్జీ కిలోవాట్‌కు రూ.40 పెంచాలని కోరాయి. 2024?25 సంవత్సరానికి సంబంధించిన వార్షిక ఆదాయ అవసరాల నివేదికను విద్యుత్ నియంత్రణ మండలికి సమర్పించాయి. మొత్త మూడు కేటగిరీల్లో విద్యుత్ చార్జీలను సవరించాలని ప్రతిపాదించాయి.తెలంగాణలో ఉత్తర, దక్షిణ డిస్కంలు ఈ ఏడాది తమ ఆదాయ, వ్యవయాల మధ్య ఉన్న లోటును వెల్లడించాయి. రెండు డిస్కంలకు కలిసి రూ.14,222 కోట్ల లోటు ఉందని అంచనా వేశాయి. ఈ



మొత్తం లోటులో రూ.13,022 కోట్లను రాష్ట్ర ప్రభుత్వం వార్షిక బడ్జెట్‌లో సమకూర్చాలని కోరాయి. అవి పోగా మిగిలిన రూ.1,200 కోట్లుచార్జీల పెంపుద్వారా పూడ్చుకోవాలని ప్రతిపాదించాయి. అయితే భారం పేద, మధ్య తరగి గృహ వినియోగదారులపై పడే అవకాశం లేనట్లు తెలుస్తోంది. ప్రస్తుతం గృహ విద్యుత్ వినియోగం 300 యూనిట్లు దాటితే.. కిలోవాట్‌కు స్థిర చార్జీ రూ.10 వసూలు చేస్తున్నారు. అయితే ఆ మొత్తాన్ని మరో రూ.40 పెంచి రూ.50 వసూలుకు అనుమతి ఇవ్వాలని డిస్కంలు ప్రతిపాదించాయి.ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం 200 యూనిట్ల విద్యుత్‌ను అర్హులకు ఉచితంగా ఇస్తోంది. ఇక 299 యూనిట్ల విద్యుత్ వాడే మధ్య తరగతి వారికి కూడా ఎలాంటి ఇబ్బంది కలుగకుండా 300 యూనిట్లు దాటినవారిపైనే భారం వేయాలని డిస్కంలు ప్రతిపాదించాయి. రాష్ట్రవ్యాప్తంగా 1.30 కోట్ల విద్యుత్ కనెక్షన్లు ఉన్నాయి. వీటిలో 300 యూనిట్లకుపైగా విద్యుత్ వినియోగించే గృహ వినియోగదా రులు కేవలం 20 శాతమే. వారిపై మాత్రమే భారం పడే అవకాశం ఉందని తెలుస్తోంది. మిగతా 80 శాతం వినియోగ దారులపై ఎలాంటి భారం ఉండదని డిస్కంలు చెబుతున్నా యి. డిస్కంల ప్రతిపాదనపై రాష్ట్రంలో కనీసం మూడుచోట్ల బహిరంగ చర్చ చేయాల్సి ఉంటుంది. ఈ సందర్భంగా అభిప్రాయ సేకరణ చేసిన తర్వాతనే చార్జీల పెంపుపై నిర్ణయం తీసుకోవాల్సి ఉంటుంది. ఆ తర్వాత చార్జీల సవరణ అమలులోకి వస్తుంది. ఈ మొత్త ప్రక్రియ పూర్తి చేయడానికి కనీసం మూడు నెలలు పట్టే అవకాశం ఉంది.

## ఆర్ఆర్ఆర్ అలైన్‌మెంట్‌పై వెనక్కి వెళ్లలేం

-మొదటిపేజీ తరువాయి

వెల్లడించారు. అయితే బాధితులకు నష్టపరిహారం పెంచే ప్రయత్నం చేస్తామని సీఎం హామీ ఇచ్చారు. సిరిసిల్లలో పవర్‌లూమ్‌ల కరెంటు ఛార్జీలను ప్రభుత్వం యూనిట్‌కు రూ.2 నుంచి రూ.8.30కు పెంచడంతో 30 వేల మంది పవర్‌లూమ్ కార్మికులు ఆందోళనలో ఉన్నారని సీఎంకు సీపీఎం ప్రతినిధి బృందం వివరించింది. గతంలో ఉన్న విధంగా యూనిట్‌కు రూ.2 చొప్పున వసూలు చేసి కార్మికులను ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. విద్యుత్ సమస్యను పరిష్కరిస్తానని, పవర్‌లూమ్ పరిశ్రమను నాలుగో కేటగిరీ కిందకు తీసుకొస్తామని సీఎం హామీ ఇచ్చారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమలోని అన్ని సమస్యలు పరిష్కరిస్తామన్నారు. రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలను అందించాలని కూడా సీపీఎం ప్రతినిధులు ముఖ్యమంత్రిని కోరారు. కాగా, తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటయోధుల విగ్రహాలను ట్యాంక్‌బండ్‌పై ఏర్పాటు చేయాలంటూ సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు.

## నాలుగు రోజులు భారీ వర్షాలు

-మొదటిపేజీ తరువాయి

నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని చెప్పింది. పలుచోట్ల ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు పడే అవకాశాలున్నాయని చెప్పింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు పడుతాయని చెప్పింది. మంగళవారం ఆదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, జనగాం, సిద్దిపేట, రంగారెడ్డి, వికారాబాద్, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్, వనపర్తి, నారాయణపేట, జోగులాంబ గద్వాల జిల్లాల్లో భారీ వర్షాలు కురిసేందుకు అవకాశాలున్నాయని వివరించింది. ఇదిలా ఉండగా.. గడిచిన 24గంటల్లో తెలంగాణవ్యాప్తంగా పలు జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాపాతం నమోదైంది. అత్యధికంగా యాదాద్రి భువనగిరిలో 10 సెంటీమీటర్ల వర్షాపాతం రికార్డయ్యింది. ఆ తర్వాత సంగారెడ్డి జిల్లా దిగ్వాల్‌లో 9 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

## సింగరేణి కార్మికులకు ఇచ్చింది బోనస్ కాదు.. బోగస్..

-మొదటిపేజీ తరువాయి

సింగరేణి కార్మికుల లాభాల వాటాపై అసత్యాలు చెప్పవద్దని హితవు పలికారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉన్న మొత్తం పది సంవత్సరాల్లో కార్మికులకు లాభాల వాటా రూపంలో దక్కింది కేవలం 365 కోట్ల రూపాయలు మాత్రమేనని కేటీఆర్ తెలిపారు. కానీ భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్న పది సంవత్సరాల్లో లాభాల వాటా రూపంలో సింగరేణి కార్మికులకు అందించింది 2780 కోట్ల రూపాయలు అని పేర్కొన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్న పది సంవత్సరాలలో సింగరేణి అద్భుతమైన ప్రగతి సాధించిందని కేటీఆర్ గుర్తుచేశారు. ఉమ్మడి రాష్ట్రంలో సింగరేణి కార్మికులకు సంస్థ లాభాలు పది, పదిహేను శాతానికి మించి ఏనాడు ఇవ్వలేదని అన్నారు. తమ ప్రభుత్వం వచ్చిన తర్వాత భారీగా లాభాలు పెరిగేలా సంస్థ పనితీరును పెంచామని.. ఒక్కొక్క కార్మికుడికి అత్యధికంగా 32% వాటా ఇచ్చామని చెప్పారు. మేము అధికారంలో వచ్చే నాటికి 17 వేల రూపాయల లాభాల వాటా ఉంటే, అధికారంలోకి దిగిపోయినప్పుడు లక్షా డెబ్బై వేల రూపాయల వరకు ప్రతి కార్మికుడికి లాభాల వాటా ఇచ్చామని తెలిపారు.
సింగరేణి ప్రాంతంలోని అన్ని స్థానాల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించిన కార్మిక లోకానికి కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన బహుమానమా ఇది అని కేటీఆర్ మండిపడ్డారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాన్ని గెలిపించినందుకు కార్మికుల పొట్టగొట్టడమా అని ప్రశ్నించారు. ప్రస్తుతం కార్మికుల హక్కులకు పూర్తిగా భంగం కలిగించేలా ఈ కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని కార్మిక లోకానికి తాము ముందే హెచ్చరించామని గుర్తుచేశారు. కాంగ్రెస్, బీజేపీ కలిసి సింగరేణి ప్రైవేటీకరిస్తుందని ముందే హెచ్చరించామని తెలిపారు. ఆ మేరకే కాంగ్రెస్, బీజేపీ కలిసి సింగరేణి గనుల వేలాన్ని నిర్వహించిందని పేర్కొన్నారు. బీజేపీ కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి భట్టి గారు వేలంలో నవ్వుతూ పాల్గొన్నారని తెలిపారు. లాభాల్లో కార్మికుల వాటా తగ్గించడం అంటే, భవిష్యత్తుతో సింగరేణి కార్మికుల ఆత్మస్థైర్యాన్ని, భాగస్వామ్యాన్ని తగ్గించి సింగరేణి ప్రైవేటీకరించే కుట్రగానే భావిస్తున్నామని కేటీఆర్ అన్నారు. సింగరేణి లాభాల వాటాపైన సింగరేణి కార్మికులు స్థానిక కాంగ్రెస్ ఎమ్మెల్యేలపై ఒత్తిడి తీసుకురావాలని పిలుపునిచ్చారు. సింగరేణి ప్రాంతంలో గెలిచిన 13 మంది ఎమ్మెల్యేలను ముఖ్యమంత్రి దగ్గరికి పంపించాలని సూచించారు. సింగరేణి ప్రాంత మంత్రులు, ఎమ్మెల్యేలు ఈ అంశంలో స్పందించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. సింగరేణి అధికార గుర్తింపు సంఘంతో పాటు, కూనంనేని సాంబశివరావు, బీజేపీ నేతలు కూడా ఈ అంశంలో స్పందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. మా సింగరేణి బొగ్గు గని కార్మిక సంఘం ద్వారా ఈ అంశంలో పోరాటం చేస్తామని స్పష్టం చేశారు.

## పోచారంలో భారీ చోరీ..

## 2.2 కోట్లు, 28 తులాల బంగారం ఎత్తుకెళ్లిన దొంగలు

**హైదరాబాద్:** మేడ్చల్ జిల్లా పోచారం ఐటీకారిడార్ ఠానా పరిధిలో భారీ చోరీ జరిగింది. చౌదరిగూడలోని మక్త గ్రామంలో నాగభూషణం అనే వ్యక్తికి చెందిన ఇంటి తాళం పగులగొట్టిన దుండగులు బీరువాలో దాచిన రూ.2.2 కోట్లతో పాటు 28 తులాలు బంగారు నగలు ఎత్తుకెళ్లారు. విషయం తెలుసుకున్న బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు దొంగతనం గల కారణాలపై ఆరా తీస్తున్నారు. కాగా, శంకర్‌పల్లిలో తన 10 ఎకరాల భూమి అమ్మడానికి నాగభూషణం ఒప్పందం చేసుకున్నాడని, అడ్వాన్స్‌గా ఇచ్చిన నగదును దొంగలు ఎత్తుకెళ్లారని పోలీసుల దర్యాప్తులో తేలింది. దీంతో ఇది తెలిసినవారు చేసిన పనేనని పోలీసులు భావిస్తున్నారు. ఈ నేపథ్యం నాగభూషణం డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.



## డాక్టర్ రాజయ్య కమిటీతో కేటీఆర్ భేటీ

**హైదరాబాద్:** రాష్ట్రంలోని ప్రజా ఆరోగ్య పరిస్థితుల అధ్యయనం కోసం పార్టీ తరఫున నియమించిన త్రిసభ్య కమిటీతో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమావేశమయ్యారు. ప్రభుత్వ దవాఖానల్లో ప్రజలకు అందుతున్న వైద్య సేవలను, సమస్యలను పరిశీలించేందుకు మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, ఎమ్మెల్యే సంజయ్‌తో మాజీ ఉప ముఖ్యమంత్రి డాక్టర్ రాజయ్య నేతృత్వంలో కమిటీని నియమించిన విషయం తెలిసిందే. త్రిసభ్య కమిటీ నేటి నుంచే కార్యాచరణ ప్రారంభించింది. ఈ నేపథ్యంలో హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో కేటీఆర్‌తో కమిటీ సభ్యులు భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. గాంధీ హాస్పిటల్‌లో మాతా శిశు మరణాలతో పాటు రాష్ట్రంలో నెలకొన్న దుర్భరమైన వైద్య ఆరోగ్య పరిస్థితుల పతనంపై ఈ కమిటీ అధ్యయనం చేయనుంది. గాంధీతో పాటు రాష్ట్రంలోని పలు హాస్పిటళ్లను సందర్శించి అక్కడి పరిస్థితులను అధ్యయనం చేసి నిర్మాణాత్మకమైన సూచనలతో కూడిన నివేదికను రాష్ట్ర ప్రభుత్వానికి అందించనుంది.

# కూకట్ పల్లి నల్ల చెరువులో హైడ్రా కూల్చివేతలు!

**హైదరాబాద్, శుభ తెలంగాణ:** హైదరాబాద్ మహా నగరంలో హైడ్రా మళ్లీ దూకుడు పెంచింది. కొద్దిరోజులగా కూల్చివేత లకు దూరంగా ఉన్న హైడ్రా బృందం.. ఆదివారం మళ్లీ అక్రమ నిర్మాణాల కూల్చివేతల ప్రక్రియను మొదలు పెట్టారు. దీంతో చెరువులు, నాలాలు ఆక్రమించి నిర్మాణాలు చేసినవారి గుండెల్లో దడ మొదలైంది. ఉదయాన్నే కూకట్ పల్లిలోని నల్ల చెరువు ప్రాంతానికి చేరుకున్న హైడ్రా బృందం.. చెరువు భూమిని ఆక్రమించి చేపట్టిన అక్రమణ నిర్మాణా లను కూల్చివేస్తున్నారు.

నివాసం ఉన్న భవనాలను మినహాయించి 16 షెడ్లను హైడ్రా కూల్చివేస్తోంది. కూల్చివేతల నేపథ్యంలో భారీగా పోలీసులు అక్కడికి మోహరించారు.కూకట్ పల్లి లోని నల్లచెరువు మొత్తం విస్తీర్ణం 27 ఎకరాలు. అయితే, దీనిలో ఎఫ్టీఎల్, బఫర్ జోన్లో ఏడు ఎకరాలు ఆక్రమణకు గురైంది.

బఫర్ జోన్లోని నాలుగు ఎకరాల్లో 50కిపైగా పక్కా భవనాలు, అపార్టు మెంట్లు నిర్మించారు. ఎఫ్టీఎల్ లోని మూడు ఎకరాల్లో 25 భవ నాలు, 16 షెడ్లు ఉన్నాయి. ప్రస్తుతం 16షెడ్లను హైడ్రా కూల్చివేస్తోంది.

అయితే, ప్రజలు నివాసం ఉండే నిర్మాణాలపై త్వరలో ప్రభుత్వం ఒక ప్రకటన చేసే అవకాశం ఉన్నట్లు తెలు స్తోంది. ప్రభుత్వ నిర్ణయం వెలువడిన తరువాత చెరువు స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన అపార్ట్ మెంట్లు, ఇళ్లపై హైడ్రా కొరడా ఝుళిపించే అవకాశం ఉంది.

అదేవిధంగా సంగారెడ్డి జిల్లా పరిధిలోని అక్రమ నిర్మాణాలపైనా హైడ్రా కొరడా ఝుళిపిస్తోంది. జిల్లా పరిధిలోని అమీన్ పూర్ మున్సిపాలిటీ కిష్టారెడ్డి పేట్ పరిధిలోని సర్వే నెం. 164లో అక్రమ నిర్మాణాలను హైడ్రా



సిబ్బంది కూల్చివేస్తున్నారు. రెండు రోజుల క్రితం రాష్ట్ర కేబినెట్ భేటీ సమావేశంలో హైడ్రాపై సీఎం రేవంత్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నా రు. హైడ్రాకు చట్టబద్ధతతో సర్వాధి కారాలు కల్పించా లని రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయించింది. ఓఆర్ఆర్ లోపల ఉన్న చెరువులు, కుంటలు, నాలాలతో పాటు వాటి ఎఫ్టీఎల్, బఫర్ జోన్ల పరిర క్షణ అధికారాలన్నీ హైడ్రాకే అప్పగిస్తూ మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. దీంతో హైడ్రా మరింత దుకుడు పెంచింది..

# దామగుండం అడవుల్లో 12 లక్షల చెట్లను తొలిగించనున్నారని వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదు..






**-తెలంగాణ అటవీ సంరక్షణ ప్రధానాధికారి రాకేష్ మోహన్ డోబ్రియాల్**

**వికారాబాద్, శుభ తెలంగాణ:** వికారాబాద్ లోని దామగుండం అడవుల్లో తూర్పు నౌకాదళ రాడార్ స్టేషన్ ను నెలకొల్పేందుకు 12 లక్షల చెట్లను తొలిగించనున్నారని వస్తున్న వార్తల్లో ఎలాంటి నిజం లేదని తెలంగాణ అటవీ సంరక్షణ ప్రధానాధికారి రాకేష్ మోహన్ డోబ్రియాల్ తెలిపారు. రాడార్ ఏర్పాటు కోసం 12 లక్షల చెట్లను తొలిగించనున్నారని వ్యాపిస్తున్న వార్తలు నిరాధారమైనవనీ, అసంబద్ధమైవని ఆయన ఖండించారు. "రాడార్ ప్రాజెక్టు నిర్మాణ కోసం కేటాయించిన మొత్తం అటవీ భూముల్లో 48% విస్తీర్ణం మాత్రమే రాడార్ స్టేషన్ నిర్మాణానికి ఉపయోగించబడుతుంది. మిగిలిన 52% విస్తీర్ణంలోని అటవీ సంపదకు ఎలాంటి హానీ జరగకుండా చర్యలు చేపట్టడం జరుగుతుంది. 48 శాతం అటవీ భూమిలోనూ కేవలం రాడార్ స్టేషన్ నిర్మాణానికి అవసరమైన కొన్ని చెట్లను మాత్రమే తొలగించడం జరుగుతుంది. స్టేషన్ నిర్మాణానికి 12 లక్షల చెట్లను తొలగించనున్నారని వస్తున్న వార్తలు పూర్తిగా అవాస్తవం. మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్ మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్ ఛేంజ్ (భారత ప్రభుత్వం) కు అనుబంధంగా పనిచేసే ఫారెస్ట్ అడ్వైజరీ అథారిటి 1,93,562 చెట్లను మాత్రమే రాడార్ స్టేషన్ నిర్మాణం కోసం తొలిగించడం జరుగుతుందని



స్పష్టం చేసింది. రాడార్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభించిన తర్వాత తొలిగించాలనుకున్న చెట్ల సంఖ్యను ఇంకా తగ్గించే దిశగా అటవీశాఖ ప్రణాళికలు రచిస్తున్నది. ఈ ప్రాజెక్టు ఏర్పాటుతో కోల్పోనున్న 1,93,562 చెట్లకు బదులుగా రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల అడవుల్లోని 2,348 హెక్టార్లలో విస్తరించి వున్న 17,55,070 చెట్లను అటవీశాఖ పునరుద్ధరించనున్నది" అని డోబ్రియాల్ తెలిపారు.

ఫారెస్ట్ కన్జర్వేషన్ యాక్ట్ ప్రకారం రాడార్ స్టేషన్ నిర్మాణానికి సంబంధించిన ప్రతిపాదనలు సంబంధిత గ్రామాలతో పాటు, గ్రామ సభల ముందు పెట్టి ఈ ప్రాజెక్టుకు అనుకూలంగా తీర్మానాలు, షెడ్యూల్డ్ తెగలు మరియు ఇతర సాంప్రదాయ అటవీ నివాసులకు ఎలాంటి ఇబ్బందులు కలగటంలేదని జిల్లా కలెక్టర్ నుంచి ఆమోదం పొందిన తర్వాతనే పనులు చేపట్టడం జరుగుతుందని డోబ్రియాల్ వివరించారు.

ఈ ప్రాజెక్టుకు అవసరమైన భూ సేకరణ కోసం భారత ప్రభుత్వం 2010 నుండే చర్యలు చేపట్టడం జరిగిందనీ, అందులో భాగంగానే మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్ మెంట్, ఫారెస్ట్ అండ్ క్లైమేట్ ఛేంజ్ భూ సేకరణ చేపట్టినట్లు డోబ్రియాల్ తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నాటి నుండి కొనసాగిన రాష్ట్ర ప్రభుత్వాలతో పరస్పర సంప్రదింపులు జరిపి రాడార్ స్టేషన్ పనులను ముందుకు తీసుకువెళ్ళిందని అన్నారు. అందుచేత ప్రస్తుత రాష్ట్ర ప్రభుత్వమే ఈ ప్రాజెక్టును ముందుకు తీసుకుపోతున్నదనే విషయం అవాస్తవమైనదన్నారు.

ఈ ప్రాంతంలో 500 ఏళ్ళుగా కొలువైన వున్న శ్రీ రామలింగేశ్వర స్వామి దేవస్థానాన్ని ప్రాజెక్టు భూసేకరణలో భాగంగా తరలిస్తున్నారనే వాదనను డోబ్రియాల్ ఖండించారు. ఈ ప్రాంతంలో 32 ఎకరాల 10 గుంటల్లో విస్తరించిన ఈ దేవాలయంతో పాటు, దేవాలయానికి అనుబంధంగా ఉన్న కొలను అలాగే కొనసాగుతాయనీ, దేవాలయాన్ని సందర్శించే భక్తులకు నేవీ అధికారులు నుండి ఎలాంటి ఇబ్బందులు వుండవని స్పష్టం చేశారు.

ఈ ప్రాజెక్టు జాతీయ ప్రాధాన్యతను కలిగి వుండటంతో పాటు, స్థానిక ప్రజలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధిని కల్పిస్తుందని పిసిసిఎఫ్ పేర్కొన్నారు. తమిళనాడులోని తిరునల్వేలి తర్వాత రాడార్ స్టేషన్ కలిగి వున్న ప్రాంతంగా, జాతీయ భద్రతను కల్పిస్తున్న కేంద్రంగా తెలంగాణకు ఈ ప్రాజెక్టుతో ప్రత్యేకత చేకూర్చుతుందని డోబ్రియాల్ అన్నారు.

# మత్స్యకారుల రాష్ట్ర సదస్సు గోడ పత్రిక ఆవిష్కరణ

**రంగారెడ్డి , శుభ తెలంగాణ** షాద్నగర్ నియోజకవర్గం చెరువులు కుంటలు, కబ్జాలు,కాలుష్యం నుండి కాపాడాలి, మత్స్య వృత్తి రక్షణ,ఉపాది జీవిత భద్రత కల్పించాలని, సెప్టెంబర్ 25 న మత్స్యకారుల రాష్ట్ర సదస్సు ఇబ్రహీంపట్నం టౌన్ లోని ఎన్ ఆర్ గార్డెన్ లో జరుగుతున్న సందర్భంగా గోడ పత్రిక ను ఆదివారం షాద్నగర్ నియోజకవర్గం ముదిరాజ్ సంఘం అధ్వర్యంలో,మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మ,ముదిరాజ్ సంఘం షాద్నగర్ నియోజ కవర్గం కన్వీనర్ మంగ వెంకటేష్, ముదిరాజ్ సంఘం నాయకులు, అంచ రాములు ముదిరాజ్, పైలయ ముదిరాజ్ సంఘం కో కన్వీనర్ భూపాల్, ముదిరాజ్ షాద్నగర్ తాలూకా ముదిరాజ్ యువత అధ్యక్షులు శ్రీధర్ వర్మ ముదిరాజ్ మరియు మండలం ముదిరాజ్ అధ్యక్షులు కుడుముల బాల్ రాజు, మత్స్య సోసైటి అధ్యక్షులు తోట్ల రాఘవేందర్, మత్స్యకార నాయకులతో కలిసి ఆవిష్కరణ చేసారు.అనంతరం మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ్మ మాట్లాడుతు మత్స్యకారుల రాష్ట్ర సదస్సుకు ముఖ్య అతిథులుగా ఇబ్రహీంపట్నం శాసన సభ్యులు శ్రీ.మలా రెడ్డి రంగారెడ్డి,శ్రీ వాకిటి శ్రీహరి ముదిరాజ్,మక్తల్,శాసనసభ్యులు, ముఠా గోపాల్, ముషిరాబాద్ శాసనసభ్యులు, మత్స్య శాఖ రాష్ట్ర ఫెడరేషన్ చైర్మన్ శ్రీ మెట్టు సాయికుమార్,ముదిరాజ్ సొసైటీ కో ఆపరేటివ్ కార్పోరేషన్ రాష్ట్ర చైర్మన్ బోర్ర జ్ఞానేశ్వర్ ముదిరాజ్, మత్స్య కార సంఘాల జాతీయ,రాష్ట్ర నాయకులు హాజరవుతారని తెలిపారు. తెలంగాణ రాష్ట్రంలో నేటికీ మత్స్య వృత్తిపై ఆధారపడి సుమారు పది లక్షల మత్స్యకార కుటుంబాలు ఉపాధి పొందుతున్నాయి, రాష్ట్రంలో సుమారు



5500 ప్రాథమిక మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల్లో 4 లక్షల 90 వేల మంది మత్స్య సహకార సంఘాల సభ్యులుగా ఉన్నారు.తెలంగాణ రాష్ట్రం సాధించుకుని 10 సంవత్సరాలు పూర్తి అయిన మత్స్యకారుల జీవితాల్లో ఎలాంటి మార్పులు రాలేదు తెలంగాణలో భూముల రేట్లు విపరీతంగా పెరిగిపోవడం వలన రాష్ట్రవ్యాప్తంగా భూ దందాలు రియల్ ఎస్టేట్ మాఫియా పెద్ద ఎత్తున చెరువులు కుంటలు జల వనరులు నదీ పరివాహక ప్రాంతాల భూములను కబ్జాలు చేస్తున్నారు,మ సంఘం గత 20 సంవత్సరాల నుండి చెరువులు కుంటల కబ్జాల పై అనేక పోరాటాలు చేసిందని దీంతో రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా సంస్థ ఏర్పాటు చేయడం అభినందనీయం దానిని రాష్ట్ర వ్యాప్తంగా విస్తరింప చేయాలి. మరోవైపు పారిశ్రామిక అభివృద్ధి పేరుతో పట్టణాల నుండి వస్తున్న రసాయనిక డ్రైనేజీ నీరు మొత్తం చెరువులు కుంటల్లో కలువడం వల్ల మత్స్య సంపద మొత్తం అంతరించిపోతుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న జలవనరులు చెరువులు కుంటలు నదీ పరివాహక ప్రాంతాల భూములను సాటిలైట్ ద్వారా సర్వే చేయించి ఎఫ్ టి ఎల్ హద్దురాళ్లు నాటి ఫెన్సింగ్ వేయాలి. జలవనరులను కబ్జాలు,కాలుష్యం నుండి మత్స్య వృత్తి రక్షణ,ఉపాది,జీవిత భద్రత కల్పించాలని,ప్రతీ మత్స్య సోసైటికి 10 లక్షల రూ,,ఆర్థిక సహాయం చేయాలని, మత్స్య సోసైటికి 20 లక్షల రూ, కమ్యూనిటీ హాలో నిర్మించాలని తదితర సమస్యలపై సెప్టెంబర్ 25న పోరాటాల పురిటిగడ్డ ఇబ్రహీంపట్నంలో ఎన్ ఆర్ గార్డెన్ లో జరిగే మత్స్యకారుల రాష్ట్ర సదస్సుకు రాష్ట్ర వ్యాప్తంగా మత్స్యకారులు మన వృత్తి పనిముట్లు వలలు, తెప్పలు,వల పందిరిలతో ఇబ్రహీంపట్నం మార్కెట్ యార్డ్ నుండి ఎన్ ఆర్ గార్డెన్ వరకు జరిగే మత్స్యకారుల ర్యాలీలో ప్రతి మత్స్యకార సోదరి సోదారులు హలో మత్స్యకార చలో ఇబ్రహీంపట్నం అనే నినాదంతో అధిక సంఖ్యలో తరలివచ్చి మన మత్స్యకారులు ఐక్యత చాటలని కోరుతున్నాము. ఈ కార్యక్రమంలో షాద్నగర్ ముదిరాజ్ యుత్ అధ్యక్షులు శ్రీధర్ వర్మ, యూత్ ఉపాధ్యక్షులు మంగ అశోక్, యువత కార్యవర్గం గుడాల గిరిబాబు ముదిరాజ్ అజయ్ మరియు, మంగ మధు శ్రీకాంత్ తదితరులు%అ% పాల్గొన్నారు.

## 'దామగుండం' రక్షణ పోరాటానికి కేటీఆర్ మద్దతు..



**వికారాబాద్, శుభ తెలంగాణ:** వికారాబాద్ జిల్లాలోని దామగుండం అడవిని కాపాడాలంటూ జర్నలిస్టు తులసి చందు చేస్తోన్న పోరాటానికి కేటీఆర్ మద్దతు తెలిపారు. ఆమెను అభినందిస్తూ, పోరాటానికి సహాయపడతామన్నారు. '12.5 లక్షల చెట్లను, మొత్తం జీవావరణ వ్యవస్థను కాపాడేందుకు.. 3 వేల ఎకరాల భూమిని కేంద్రానికి అప్పగించేందుకు 10 ఏళ్లుగా కేసీఆర్ నిరాకరించారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వం తలొగ్గింది. మూసీ నది ఉద్భవించిన ఈ ప్రాంతం గొప్ప జీవవైవిధ్యానికి నిలయం' అని %శ% వేదికగా పేర్కొన్నారు.

## వికారాబాద్ లో చైన్ స్నాకర్స్ హల్చల్



**వికారాబాద్, శుభ తెలంగాణ:** వికారాబాద్ మున్సిపల్ 31వ వార్డు శివరాం నగర్ కాలనీలో ఓ కిరాణ షాప్ లో సిగరెట్ల కోసం వచ్చిన కేటుగాళ్లు ఓ మహిళ మెడలో నుండి పుస్తెలతాడు లాక్కొని పారిపోయారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## తిరుమల నెయ్యి ట్యాంకర్లకు జీపీఎస్, ఎలక్ట్రిక్ లాకింగ్



**తిరుపతి, శుభ తెలంగాణ:** తిరుమలకు పంపే నందిని ఆవు నెయ్యి ట్యాంకర్లకు జీపీఎస్, ఎలక్ట్రిక్ లాకింగ్ వ్యవస్థలను ఏర్పాటు చేస్తున్నట్లు కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ అధికారులు తెలిపారు. ఎలక్ట్రిక్ లాకింగ్ సిస్టమ్ వల్ల మార్గమధ్యలో ఎవరూ ట్యాంకర్‌ను తెరవలేరని, టీటీడీ అధికారులు ఓటీపీ ఎంటర్ చేస్తేనే తెరుచుకుంటుందని అన్నారు. నెల రోజుల క్రితమే టీటీడీకి నెయ్యి సరఫరాను పునరుద్ధరించామని కర్ణాటక మిల్క్ ఫెడరేషన్ వివరించింది...

## మెగాస్టార్ చిరంజీవి స్వయంకృషికి అరుదైన గౌరవం



**హైదరాబాద్, శుభ తెలంగాణ:** మెగాస్టార్ చిరంజీవి స్వయం కృషితో ఉన్నత శిఖరాలను చేరి ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచారు. తాజాగా మెగాస్టార్‌కి మరో గౌరవం దక్కింది. గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డుల్లో చిరంజీవి పేరు నమోదైంది. ఈ విషయాన్ని తెలియ జేస్తూ హైదరాబాద్‌లోని ఓ హొటల్‌లో ఈరోజు ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ఇందుకు సంబంధించిన సర్టిఫికెట్‌ను బాలీవుడ్ స్టార్ హీరో, మిస్టర్ పర్‌ఫెక్ట్ అమీర్ ఖాన్ చేతుల మీదుగా చిరంజీవి అందుకున్నారు. డాన్స్‌కి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచారు చిరంజీవి. ఆరు పదుల వయసులో కూడా అదే ఎనర్జీ, గ్రేస్‌తో డ్యాన్స్ చేస్తున్నారు. ఈ క్రమంలో 143 మూవీల్లో 537 పాటల్లో 24000 స్టెప్పులు వేసినందుకు గానూ మెగాస్టార్ గిన్నిస్ బుక్‌లోకి ఎక్కారు. చిరంజీవి పేరు గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్స్‌లో ఎక్కడంలో మెగా అభిమా నుల ఆనందానికి అవధు లు లేకుండా పోయాయి.

## హైదరాబాద్ లో భారీ చోరీ...

**హైదరాబాద్:, శుభ తెలంగాణ** హైదరాబాద్ శివారులోని ఐటీ కారిడార్ లో భారీ చోరీ జరిగింది. భూమి అమ్మగా వచ్చిన రూ.2 కోట్ల నగదు ఇంట్లో దాయగా.. దొంగలు పడి నోట్ల కట్టలను ఎత్తుకెళ్లారు. నోట్ల కట్టలతో పాటు బీరువాలో దాచుకున్న 28 తులాల బంగారు ఆభరణాలు కూడా మాయం చేశారు. పోలీసులు, బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. ఐటీ కారిడార్ లోని మక్త గ్రామంలో నాగభూషణం అనే వ్యక్తి నివాసం ఉంటున్నాడు. ఇటీవల శంకర్ పల్లిలో తనకున్న 10 ఎకరాల భూమిని నాగభూషణం అమ్మకానికి పెట్టాడు. మంచి ధర రావడంతో అమ్మకానికి సంబంధించి ఒప్పందం కుదుర్చుకున్నాడు. ఇందులో భాగంగా రూ.2 కోట్ల 2 లక్షలు అడ్వాన్స్ గా తీసుకున్నాడు. ఈ సొమ్మును నాగభూషణం ఇంట్లోనే దాచాడు. ఈ విషయం ఎలా తెలిసిందో ఏమో కానీ శనివారం రాత్రి దొంగలు పడి ఆ సొమ్మంతా ఎత్తుకెళ్లారు. ఇంటి తాళాలు, బీరువా తాళాలు పగలకొట్టి డబ్బు, నగలు పట్టుకెళ్లారని బాధితుడు నాగభూషణం కన్నీటిపర్యంతమయ్యాడు. నాగభూషణం ఫిర్యాదుతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు.. దొంగతనం జరిగిన తీరును పరిశీలించి, పరారైన దొంగల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. అనుమానంతో నాగభూషణం డ్రైవర్ ను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

# ప్రజా అవసరాల కోసం బీఆర్ఎస్ ఆఫీసు

**ప్రజా అవసరాలకు వినియోగించాలని వినతి**

**నల్గొండ, శుభ తెలంగాణ :** కోర్ట్ తీర్పును గౌరవిస్తాం. సుప్రీంకోర్టులో అప్పీల్ చేస్తాం. అప్పటి వరకు బీఆర్ఎస్ ఆఫీసు కూల్చొద్దు. నల్గొండ లోని ఏ పార్టీ కార్యాలయానికి అనుమతులు లేవు. ఈ విషయంలో అన్ని పార్టీలు కలిసి రావాలి.. మంత్రి కోమటిరెడ్డి మాటలకు, అధికారులు మోసపోవద్దు. ప్రజా అవసరాల కోసం బీఆర్ఎస్ ఆఫీసు ను ఉపయోగించండి..” అని నల్గొండ బీఆర్ఎస్ నేతలు పేర్కొన్నారు .ఎలాంటి అనుమతులు లేకుండా నల్గొండ జిల్లా కేంద్రం లో నిర్మించిన బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని కూల్చాలని 15 రోజుల గడువు ఇస్తూ హై కోర్టు బుధవారం తీర్పు ఇచ్చిన విషయం తెలిసిందే.నిబంధనల మేరకు నాటి మంత్రివర్గ ఆమోదంతో.. ఆగ్రో సంస్థకు చెందిన, ఎకరం భూమిని ప్రభుత్వ నిబంధనల మేరకు డబ్బులు చెల్లించి, తీసుకొని పార్టీ కార్యాలయాన్ని నిర్మించినట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. కార్యాలయంలో గత మూడు సంవత్సరాలుగా అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అయితే జిల్లాకు చెందినమంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి..బీఆర్ఎస్ పై కక్షపూని అనేక సమావేశాలలో, పార్టీ కార్యాలయాన్ని కూలగొట్టాలని.. అధికారులను ఆదేశించారన్నదే వీరి అభియోగం. నాటి మున్సిపల్ కమిషనర్ కు నిర్మాణ అనుమతి కోరుతూ దాఖలు చేసినా ఏ పార్టీ కార్యాలయానికి అనుమతులు లేవంటూ తాత్సారం చేశారని గుర్తు చేస్తున్నారు. మున్సిపాలిటీ నుంచి తమకు నోటీసులు ఇచ్చినప్పుడు.. తాము ఫైన్ తో డబ్బులు చెల్లిస్తామని నిర్మాణానికి అనుమతి ఇవ్వాలని కోరినా .. మంత్రి ఆదేశంతో తిరస్కరించారన్నారని మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్ రెడ్డి వివరించారు.గత్యంతరం లేకనే బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించంగా, . కోర్టు తీర్పు బీఆర్ఎస్ కు ప్రతికూలంగా వచ్చింది. ‘ కోర్టు తీర్పును ఆసరా




చేసుకున్న కొంతమంది కాంగ్రెస్ పార్టీ నాయకులు.. జడ్జిమెంట్ కాపీ రాకముందే.. జెసిబి లు బుల్డోజర్లతో.. కార్యాలయాన్ని కులగొట్టాలని చూస్తున్నారు..’ అని జిల్లాపరిషత్ మాజీ చైర్మన్ బండా నరేందర్ రెడ్డి అభిప్రాయపడ్డారు. జడ్జిమెంట్ కాపీ అందిన వెంటనే కోర్టులో అప్పీల్ చేస్తామని, అప్పటివరకు బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని కూల్చవద్దని పార్టీ నేతలు పేర్కొంటున్నారు.

**ఏ పార్టీ ఆఫీసుకు అనుమతుల్లేవా.?**

జిల్లాలో ఏ పార్టీ కార్యాలయానికి అనుమతులు లేవని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. అన్ని పార్టీల కార్యాలయాలకు కూడా ఇలాంటి నిబంధనలు వర్తింప చేస్తారా అన్న ప్రశ్నలు కూడా ఆ వర్గాల నుంచి వస్తున్నాయి. దశాబ్దాల కిందటే జిల్లా కేంద్రం లో సీపీఐ, సీపీఎం, టీడీపీ, బీజేపీ లకు విలువైన ప్రాంతాల్లో ఆఫీసులు ఉన్నాయి. కాంగ్రెస్ కార్యాలయం కూడా నిర్మాణంలో ఉంది. బీఆర్ఎస్ ఆఫీసు వ్యవహారంతో ఇపుడు అన్ని ఆఫీసుల విషయం చర్చకు వస్తోంది.

# 4 నెలల ముందు నుంచే ఎన్నికల కోలాహలం

**కరీంనగర్, శుభ తెలంగాణ :** ఉత్తర తెలంగాణలోని కరీంనగర్ ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానం వచ్చే ఫిబ్రవరిలో ఖాళీ అవుతుంది. సిట్టింగ్ ఎమ్మెల్సీగా కాంగ్రెస్ పార్టీకి చెందిన జీవన్ రెడ్డి ఉన్నారు. బిఆర్ఎస్ హవా కొనసాగిన సమయంలోనే కాంగ్రెస్ కు చెందిన జీవన్ రెడ్డి ఎమ్మెల్సీగా గెలుపొందడంతో ప్రధాన పార్టీల నుంచి పోటీ చేసేందుకు బోలెడు మంది ఆసక్తి చూపుతున్నారు.నాలుగు ఉమ్మడి జిల్లాలతో ముడిపడి ఉన్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో నిలిచే వారి సంఖ్య ఈసారి సెంచరీ దాటనుంది. పోటీకి ఆసక్తి చూపుతున్న వారు ఓటర్ నమోదు ప్రక్రియతో ప్రచారాన్ని చేపట్టారు. ఎలక్షన్ కమిషన్ అక్టోబర్ 1 నుంచి ఓటర్ల నమోదు ప్రక్రియ ప్రారంభిస్తుండగా ఆశావాహులు ఇప్పటికే ఎన్రోల్మెంట్ ప్రక్రియను చేపట్టి మద్దతు కూడగట్టుకుంటున్నారు.అధికార కాంగ్రెస్ పార్టీ తోపాటు బీఆర్ఎస్, బీజేపీ అభ్యర్థులుగా బరిలోకి దిగి తమ అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో నిమగ్నమయ్యారు. పార్టీ తమకు వేదిక అవుతుందని, టికెట్ రాకపోయినా బరిలో ఉండేందుకు సిద్ధమవుతున్నారు. మున్ముందు ఈ పోటీ అన్ని పార్టీల్లో పెరిగి స్వతంత్రుల సంఖ్య పెరిగే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి.రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసే వారి సంఖ్య రోజురోజుకు పెరుగు తుంది. కాంగ్రెస్ కష్టకాలంలో జీవన్ రెడ్డి ఎమ్మెల్సీగా గెలు పొందారు. ప్రస్తుతం ఆయన పోటీకి ఆసక్తి చూపడం లేదు. దీంతో కాంగ్రెస్ నుంచి పోటీ చేసేందుకు ఎక్కువ మంది పోటీ పడుతున్నారు.ప్రస్తుతం కరీంనగర్ కు చెందిన ఆల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ నరేందర్ రెడ్డి, ఇటీవల ఎంపీ ఎన్నికల్లో పోటీ చేసి ఓటమిపాలైన వెలిచాల రాజేందర్ రావు పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. నరేందర్ రెడ్డి ఇప్పటికే ఉమ్మడి నాలుగు జిల్లాల్లో పర్యటిస్తూ విద్యాసంస్థల ఉద్యోగుల తో సమావేశమై ఓటు నమోదు ప్రక్రియ ముమ్మరం చేశారు. టికెట్ రాకపోయినా ఇండిపెండెంట్ గా పోటీ ఉంటానని స్పష్టం చేశారు.ఉత్తర తెలంగాణలో తన విద్యాసంస్థలు, తనకున్న పరిచయాలతో గ్రాడ్యుయేట్ల వివరాలు ఎన్రోల్మెంట్ కోసం సేకరిస్తున్నారు. వెలిచాల రాజేందర్ రావు ఎంపీ ఎన్నికల అనంతరం నియోజకవర్గంలో క్రియాశీలకంగా వ్యవహరిస్తు సిరిసిల్ల చేనేతకు ప్రభుత్వ బ్రాండింగ్, ట్రేడింగ్లో శిక్షణ, గ్రాడ్యేయేట్లకు మేనిఫెస్టోలతో ముందుకెళ్తున్నారు. ఎమ్మెల్సీగా పార్టీ అవకాశమిస్తే పోటీ చేస్తానని తెలిపారు. పార్టీ నిర్ణయమే



తనకు శిరోధార్యమని, ఎవరికి టికెట్ ఇచ్చినా బలపరుస్తానని స్పష్టం చేస్తున్నారు.రాష్ట్రంలో ప్రధాన ప్రతిపక్షంగా ఉన్న బీఆర్ఎస్ నుంచి మాజీ మేయర్ సర్దార్ రవీందర్ సింగ్, డాక్టర్ బీఎన్ రావు, ట్రస్మా ప్రతినిధి యాదగిరి శేఖర్ రావు పేర్లు ప్రము ఖంగా వినిపిస్తున్నాయి. మాజీ ఎమ్మెల్సీ ఆర్.సత్యనారాయణ సైతం టికెట్ ఆశిస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఇటీవల కేసిఆర్ ను రవీందర్ సింగ్ కలిసి అభయం కూడా తీసుకు న్నారు. అయితే ఎవరికి వారే గ్రౌండ్ వర్క్ చేసుకుంటున్నారు. గత స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికలో పోటీ చేసిన రవీందర్ సింగ్ మేయర్ గా సివిల్ సప్లై కార్పొరేషన్ చైర్మన్ గా అందించిన సేవలు, ప్రైవేట్ టీచర్లు, లెక్చరర్లకు చేసిన సేవల ఆధారంగా మద్దతు కూడగట్టుకుంటున్నారు. ఇక కేంద్రంలో అధికారంలో ఉన్న బిజేపి పోటీకి ఆసక్తి చూపే వారి సంఖ్య కూడా బాగానే ఉంది. కరీంనగర్, ఆదిలాబాద్ నిజామాబాద్ మెదక్ ఎంపీలుగా బిజేపికి చెందిన వారే ఉండడంతో ఎమ్మెల్సీ గా గెలుస్తామనే ధీమాతో ఆ పార్టీ నుంచి టికెట్ రేస్ లో ప్రముఖుల పేర్లు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం బిజెపి అధికార ప్రతినిధి రాణిరుద్రమ, బిజేపి కిసాన్ సెల్ జాతీయ ప్రధాన కార్యదర్శి సుగుణాకర్ రావు, జగిత్యాల మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ బోగ శ్రావణ తమ అదృష్టాన్ని పరీక్షించుకునే పనిలో నిమగ్నమయ్యారు. పార్టీలో సీనియర్ నేత అయిన తనకు ఇటీవల అసెంబ్లీ, ఎంపీ ఎన్నికల్లో అవకాశం దక్కలేదని ఈసారి ఎలాగైనా తనకు ఎమ్మెల్సీ అవకాశం ఇవ్వాల్సిందేనని సుగుణాకర్ రావు పట్టుబడుతున్నారు. రాణీ రుద్రమసిరిసిల్ల నుంచి అవకాశం కల్పించిన నేపథ్యంలో ఈసారి తమకు ఇవ్వాల్సిందేని సుగుణాకర్రావు వర్గం వాదిస్తోంది. మరోవైపు రాణీరుద్రమ మాత్రం కేంద్రమంత్రి బండి సంజయ్ ని నమ్ముకుని టికెట్ ప్రయత్నాలు చేస్తున్నారు. ఒక్కో ఎంపీ తరపున ఒకరు టికెట్ కోసం గట్టి ప్రయత్నాలే చేస్తుండడంతో అభ్యర్థి ఎంపిక ఆ పార్టీకి తలనొప్పిగానే మారనుంది.మూడు ప్రధాన పార్టీల నుంచే కాకుండా పార్టీ టికెట్ దక్కకపోయినా స్వతంత్ర అభ్యర్థిగా బరిలో నిలిచేందుకు ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. అయితే ఎమ్మెల్సీ అభ్యర్థిని ఎవరిని ఎంపిక చేయాలి... అధిష్టానం ఎలాంటి వ్యూహాలతో ముందుకు సాగుతుందో ఎవరి అంతుచిక్కడం లేదు. టికెట్ ఆశిస్తున్న అభ్యర్థులంతా ఎవరి ధీమాలో వారు ఉన్నారుఎన్నికల్లో మరో నాలుగు నెలల తరువాత జరగనున్న నేపథ్యంలో ఇప్పుడే నిర్ణయం తీసుకోవడం అవసరమా? అన్న భావనతో పార్టీ ముఖ్యనేతలు ఉన్నట్టుగా తెలుస్తోంది. షెడ్యూల్ వెలువడిన తరువాత అభ్యర్థుల ఎంపిక ప్రక్రియపై దృష్టి సారించే యోచనలో ప్రధాన పార్టీలు ఉన్నట్లు సమాచారం.

# గులాబీ భవనాల వైపు బుల్డోజర్లు

**నల్గొండ, శుభ తెలంగాణ :** నల్లగొండలో అనుమతి లేకుండా నిర్మించిన బీఆర్ఎస్ కార్యాలయాన్ని కూల్చివేయాలనే హైకోర్టు ఆదేశాలతో గులాబీ పార్టీలో అలజడి మొదలైంది. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా, హైదరాబాద్తో సహా రాష్ట్రంలో కొత్తగా ఏర్పాటు చేసిన 33 జిల్లాల్లో పార్టీ కార్యాలయాలను నిర్మించాలని భావించింది. ఇప్పటికే చాలా జిల్లాల్లో పార్టీ ఆఫీసులు నిర్మించగా, కొన్ని చోట్ల ఎలాంటి అనుమతులు తీసుకోలేదని ఆరోపణలు ఉన్నాయి. దీంతో అధికార కాంగ్రెస్ ఆయా భవనాలపై ఫోకస్ చేసింది.ముందుగా నల్గొండలో బీఆర్ఎస్ భవన్కు అనుమతులు లేవని? ఆ భవనాలను కూల్చేయాలని రెండు నెలల క్రితం రాష్ట్ర రోడ్లు, భవనాల మంత్రి కోమటిరెడ్డి వెంకట్రెడ్డి హుకుం జారీ చేయడంతో తేనె తుట్టె కదిలింది. మంత్రి కోమటిరెడ్డి హెచ్చరికలతో బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించగా, అక్కడ ఎదురుదెబ్బ తగిలింది. దీంతో నల్గొండతో సహా మిగిలిన చోట నిర్మించిన బీఆర్ఎస్ భవనాలపైనా బుల్డోజర్ యాక్షన్ ఉంటుందా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి.ఏపీలో వైసీపీ ప్రధాన కార్యాలయానికి అనుమతులు లేవన్న కారణంతో రెండు నెలల క్రితం ఆ భవనాన్ని నేలమట్టం చేసింది ఏపీ ప్రభుత్వం. ఆ క్రమంలోనే ఇక్కడా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాలపై కాంగ్రెస్ పార్టీ ఫోకస్ చేయగా, నల్గొండతోపాటు సూర్యాపేట, భువనగిరి, పెద్దపల్లి, మహబూబాబాద్, భూపాలపల్లి, హన్మకొండ, జనగామల్లో భవనాలకు అనుమతిలేదని అధికారులు గుర్తించారు. దీంతో ఆయా కార్యాలయాలకు అప్పట్లోనే నోటీసులు జారీ చేశారు. ఐతే నల్గొండ భవనం విషయమై బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించడంతో మిగిలిన



భవనాలపైనా ఇంతవరకు ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఇప్పుడు హైకోర్టు లైన్ క్లియర్ చేయడంతో నల్గొండ బీఆర్ఎస్ కార్యాలయం కూల్చి వేతకు ప్రభుత్వం రంగం సిద్ధం చేస్తోందని చెబుతున్నారు. ఇదే సమయంలో మిగిలిన కార్యాలయాల వైపూ బుల్డోజర్లు వెళ్లను న్నాయా అన్న చర్చ జోరుగా సాగు తోంది. తెలంగాణలోని అన్ని జిల్లాల్లో బీఆర్ఎస్ కార్యాల యాలను నిర్మించాలని భావించిన ఆ పార్టీ హైకమాండ్? 2018లో రెండోసారి అధికారంలోకి వచ్చాక కొత్త జిల్లాల్లో పార్టీ కార్యాలయాలకు స్థలాలను కేటాయించింది. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు స్థలాలను కొనుగోలు చేసి ఆఫీసులు నిర్మించింది. ఇప్పటికే చాలా చోట్ల పనులు పూర్తయి కార్యాలయాలు ప్రారంభమ య్యాయి. ఎక్కడో ఒకటో రెండో మాత్రమే నిర్మాణం పూర్తి కాలేదు. ఇప్పుడు అనుమతులు లేవన్న కారణంతో ఆయా కార్యాలయాలను కూల్చివేస్తే బీఆర్ ఎస్కు రాజకీయంగా దెబ్బేనన్న వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. ఇదే సమయంలో బీఆర్ఎస్ కార్యాలయాలను కూల్చివేస్తే ప్రతీకార రాజకీయాలు చేస్తోందని ప్రభుత్వంపై ఆ పార్టీ విమర్శలు గుప్పించే అవకాశాలు ఉన్నాయంటున్నారు. దీంతో ప్రభుత్వం భవనాల కూల్చివేతకే మొగ్గు చూపుతుందా? లేక రాజకీయ విమర్శలకు తావు లేకుండా ఇంకేమైనా చర్యలు తీసుకుంటుందా? అన్న సందేహాలు వ్యక్తవుతున్నాయి.ఇప్పటికే ఒకవైపు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై ఆకర్ష్ వల వేసిన కాంగ్రెస్?. 10 మంది ఎమ్మెల్యేలను పార్టీలో చేర్చుకుంది. ఇప్పుడు ఏకంగా బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాల కూల్చివేత వైపు ఫోకస్ చేస్తుండటంతో రాష్ట్రంలో రాజకీయం వేడెక్కే పరిస్థితి కనిపిస్తోంది. అక్రమ నిర్మాణాలైనా ప్రభుత్వం తలుచుకుంటే క్రమబద్ధీకరించే అవ కాశం ఉంటుంది. కానీ, బీఆర్ఎస్ అధిష్టానంపై మానసికంగా పైచేయి సాధించాలనే ఆలోచనతో కార్యాలయాలను కూల్చి వేస్తే అది ప్రభుత్వంపై ఎలాంటి ప్రభావం చూపుతుందనే అంశాన్ని పరిశీలిస్తున్నారు.మొత్తానికి కాంగ్రెస్ బుల్డోజర్ ముందుకు కదిలే అంశంలో ఎప్పుడేం జరుగుతుందో అన్న ఉత్కంఠ మాత్రం జోరుగా సాగుతోంది. అనుమతి లేని నిర్మాణాల కూల్చివేత మొదలు పెడితే.. అది బిఆర్ ఎస్ కార్యాలయాలకే పరిమితం చేయడం సాధ్యం కాదు.. అలా ముందుకు వెళ్తే అనేక చోట్లు సామాన్యులు నిర్మించుకున్న భవనాలను కూల్చాల్సిన పరిస్థితి రావచ్చు.. దీంతో ప్రభుత్వం ఇప్పుడేం చేయబోతుందన్నది ఆసక్తిరేపుతోంది.

## యాదగిరిగుట్టలో మంత్రులు తుమ్మల, కోమటిరెడ్డి పూజలు



**యాదాద్రి భువనగిరి, శుభ తెలంగాణ :** యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి వారిని మంత్రులు కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు ఆదివారం దర్శించుకున్నారు. స్వామి వారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. అంతకుముందు మంత్రులకు ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అధికారులు స్వామి తీర్థ ప్రసాదాలు అందజేశారు. రాష్ట్ర ప్రజలతో పాటు దేశప్రజలపై లక్ష్మీనరసింహస్వామి దీవెనలు ఉండాలని స్వామి వారిని ప్రార్థించినట్లు మంత్రులు ఈ సందర్భంగా తెలిపారు. వారి వెంట ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య, భువనగిరి ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి, తదితరులు ఉన్నారు.

## సింగరేణి కార్మికులకు భారీ నజరానా



**హైదరాబాద్, శుభ తెలంగాణ :** తెలంగాణ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు బోనస్ ప్రకటించింది. తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి సింగరేణి కార్మికులకు లాభాల్లో వాటాను దసరా బోనస్ గా ప్రకటించారు. సింగరేణి సంస్థ ఉద్యోగులకు బంపర్ బొనాంజా ప్రకటించింది తెలంగాణ ప్రభుత్వం. దసరా సందర్భంగా గతంలో ఎన్నడూ లేని విధంగా భారీ బోనస్ ప్రకటించింది. 2023-24 ఏడాదిలో సింగరేణికి 4,701 కోట్లు లాభం వచ్చింది. ఇందులో సింగరేణి కార్మికులకు 796 కోట్ల రూపాయలు బోనస్గా ప్రకటిస్తున్నట్టు చెప్పారు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క. సగటున ఒక్కో కార్మికుడికి 1.90లక్షలు బోనస్.. అలాగే కాంట్రాక్ట్ కార్మికులకు 5వేల రూపాయల చొప్పున ఇస్తున్నట్లు చెప్పారు భట్టి. సింగరేణి చరిత్రలో తొలిసారిగా కాంట్రాక్ట్ ఉద్యోగులకూ బోనస్ ఇస్తున్నామన్నారు. అనంతరం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం సింగరేణి కార్మికులకు శుభవార్త అందించింది. రూ.4,701 కోట్ల రూపాయల ప్రాపర్టీ ట్యాక్స్ లో రూ.796 కోట్లను సింగరేణి కార్మికులకు పంచుతున్నాం. ఒక్కొక్క సింగరేణి కార్మికుడికి 1 లక్షా 90వేలు బోనస్ ఇస్తున్నాం. కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5 వేలు ఇస్తాం. కాంట్రాక్టు కార్మికులకు బోనస్ ఇవ్వడం ఇదే మొదటి సారి. గత ఏడాది కంటే 20 వేలు అధికంగా బోనస్ ఇచ్చాం. సింగరేణి లాభాల్లో 33 శాతం వాటాను కార్మికులకు బోనస్ గా అందిస్తున్నాం. తెలంగాణ రాష్ట్ర సాధనలో సింగరేణి కార్మికులు సైతం తమ వంతు పాత్ర పోషించారు’ అని వ్యాఖ్యానించారు.సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకెళ్లడంలో సింగరేణి కార్మికులు కీలక పాత్ర పోషించారు. సింగరేణి కార్మికులకు బోనస్ ఇవ్వాలనే ప్రతిపాదన వచ్చింది. దాంతో సింగరేణి కార్మికులకు దసరా బోనస్ ప్రకటిస్తున్నాం. దసరా కంటే ముందుగానే సింగరేణిలో లాభాల వాటా పంచడం ద్వారా కార్మికుల కుటుంబాల్లో ఆనందాన్ని చూడాలనుకున్నాం. సింగరేణి సంస్థ రాష్ట్రంలోని విద్యుదుత్పత్తి కేంద్రాలతో పాటు ఇతర సంస్థలకు, ఇతర రాష్ట్రాలకు బొగ్గు ఎగుమతి చేస్తోంది. సింగరేణి కార్మికులు 2023-24 సంవత్సరంలో సంస్థకు మొత్తంగా రూ.4,701 కోట్ల ఆదాయం చేకూర్చారు. ఇందులో సంస్థ విస్తరణ, పెట్టుబడులకు రూ.2,289 కోట్లు కేటాయించారు. మిగిలిన మొత్తం రూ.2,412 కోట్లు కాగా, ఇందులో నుంచి మూడో వంతు రూ.796 కోట్లను కార్మికులకు దసరా బోనస్గా తెలంగాణ ప్రభుత్వం ప్రకటించింది. సింగరేణిలో 41,387 మంది శాశ్వత కార్మికులు, ఉద్యోగులు ఉన్నారు. గతేడాది సింగరేణి కార్మిలకు అందిన బోనస్ రూ.1.70 లక్షలు కాగా, ఈ ఏడాది ఒకొక్కరికి బోనస్ కింద రూ.1.90 లక్షలు అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు.సింగరేణి సంస్థ ఆర్జించిన లాభాలను పెట్టుబడులు పెట్టాలని నిర్ణయించారు. రామగుండంలో 500 మెగావాట్ల పంప్డ్ స్టోరేజ్ ప్లాంట్ నిర్మాణం, సోలార్ విద్యుదుత్పత్తి కేంద్రాన్ని 1000 మెగావాట్లకు విస్తరించడం, రామగుండంలో టీఎస్ జెన్ కో ఆధ్వర్యంలో మరో 1ఠ800 మెగావాట్ల థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం, జైపూర్లోని ప్రస్తుత థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రంలో మరో 1ఠ800 మెగావాట్ల సామర్థ్యంతో మరో కేంద్రం, ఒడిశాలోని నైనీ బ్లాక్పైన (పిట్హెడ్) 2,400 మెగావాట్ల సామర్థ్యం కలిగిన థర్మల్ విద్యుదుత్పత్తి కేంద్రం ఏర్పాటు చేయాలని భావిస్తున్నట్లు భట్టి విక్రమార్క తెలిపారు. సంస్థ పరిధిలోని వీకే ఓపెన్ కాస్ట్, గోలేటీ, నైనీ ఓసీలను ప్రారంభిస్తామని, సింగరేణి కార్మికులు, ఉద్యోగుల పిల్లల కోసం నూతన రెసిడెన్షియల్ పాఠశాలలు, ఇంటిగ్రేటెడ్ స్కూల్స్, ఏరియా ఆసుపత్రుల ఆధునికీకరణతో పాటు హైదరాబాద్లో మల్టీ స్పెషాలిటీ ఆసుపత్రి ఏర్పాటుకు చర్యలు తీసుకుంటున్నామని ఉప ముఖ్యమంత్రి వెల్లడించారు. మని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు.వరద బాధితులను ఆదుకునేందుకు సింగరేణి ఉద్యోగులు పెద్ద మనసుతో ముందుకొచ్చారు. సింగరేణి కార్మికులు తమ ఒకరోజు వేతనం రూ.10.25 కోట్లను తెలంగాణ సీఎ సహాయనిధికి విరాళంగా ఇచ్చారు. హైదరాబాద్లో సీఎం రేవంత్రెడ్డికి చెక్కును డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ అధ్యక్షుడు కూనంనేని సాంబశివరావు, సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం అధ్యక్షుడు సీతారామయ్య, ఐఎన్టీయూసీ జనరల్ సెక్రటరీ జనక్ ప్రసాద్, సింగరేణి సీఎండీ బలరాం, రామగుండం ఎమ్మెల్యే రాజ్ఠాకూర్లు సెప్టెంబర్ 19న కలిసి అందజేశారు. దాంతోపాటు కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు సైతం రూ.2.50 లక్షలను వరద బాధితుల కోసం విరాళం అందించారని తెలిసిందే.

## అమీన్పూర్ మున్సిపాలిటీలో హైడ్రా బుల్డోజర్లు.. పటేల్గూడలో విల్లాల కూల్చివేత

సంగారెడ్డి, **శుభ తెలంగాణ:** జిల్లాలోని అమీన్పూర్ మున్సిపాలిటీలో హైడ్రా మరోసారి బుల్డోజర్లకు పనిచెప్పింది. మున్సిపల్ పరిధిలోని పటేల్గూడ, కిష్టారెడ్డిపేటలో కూల్చివేతలు కొనసాగు తున్నాయి. ప్రభుత్వ భూముల్లో విల్లాలు, అపార్టుమెంట్లు నిర్మించినట్లు హైడ్రా అధికారులు గుర్తించారు. దీంతో కిష్టారెడ్డిపేటలోని 164వ సర్వేనంబర్లోని ఉన్న మూడు అంతస్తుల భవనాన్ని కూల్చివేశారు. అదేవిధంగా పటేల్గూడలోని 12వ సర్వేనంబర్లో 12 విల్లాలను నేలమట్టం చేస్తున్నారు. కాగా, కూల్చివేతల సమయంలో స్థానికులు ఆందోళనకు దిగడంతో ఉద్రిక్త పరిస్థితి ఏర్పడింది. దీంతో కూల్చివేతలు కొనసాగుతున్న ప్రదేశానికి 500 మీటర్ల దూరంలో పోలీసులు అందరినీ ఆపేశారు. కిష్టారెడ్డిపేట, పటేల్గూడలో హైడ్రా అధికారులు, పోలీసులు భారీగా మోహరించారు. కాగా, కూకట్పల్లిలోని నల్లచెరువులో అక్రమ నిర్మాణాలను హైడ్రా సిబ్బంది కూల్చివేస్తున్నారు. భారీ పోలీసు బందోబస్తు మధ్య కూల్చివేతలు కొనసాగుతున్నాయి. నల్లచెరువు విస్తీర్ణం 27 ఎకరాలు ఉండగా.. 14 ఎకరాలు ఆక్రమణకు గురైనట్లు అధికారులు గుర్తించారు. ఇందులో ఎఫ్టీఎల్, బఫర్జోన్లో 7 ఎకరాలు ఉన్నట్లు తేలింది. బఫర్జోన్లోని 4 ఎకరాల్లో 50కిపైగా పక్కా భవనాలు, అపార్టుమెంట్లు నిర్మించారు. ఎఫ్టీఎల్లోని 3 ఎకరాల్లో 25 భవనాలు, 16 షెడ్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో నివాసం ఉన్న భవనాలను మినహాయించి 16 షెడ్లను అధికారులు కూల్చివేస్తున్నారు. అయితే కూల్చివేతలపై స్థానికులు ఆందోళనకు దిగారు. కూల్చివేతలతో తమ బతులు రోడ్డున పడుతాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కనీసం వస్తువులు తీసుకోవడానికి కూడా సమయం ఇవ్వడం లేదంటూ రోధిస్తున్నారు.

# పెళ్లి తర్వాత మహిళలు ఎందుకు బరువు పెరుగుతారంటే..



పెళ్లి తర్వాత మహిళలు బరువు పెరుగుతారని చాలా సార్లు వినే ఉంటారు. కొందరు దీనిని ఒక సాధారణ అపోహగా కొట్టిపారేసినప్పటికీ, వాస్తవానికి ఇందులో కొంత నిజం ఉంది. ముఖ్యంగా మహిళలు వివాహం తర్వాత బరువు పెరిగే అవకాశం ఉందని అధ్యయనాలు చెబుతున్నాయి. వివాహం తర్వాత మహిళల్లో బరువు పెరగడానికి దోహదపడే అనేక అంశాలలో అనారోగ్యకరమైన అలవాట్లు, భాగస్వామ్య భోజనం నుండి ఒత్తిడి, వ్యక్తిగత సమయం లేకపోవడం వరకు, వారి సంబంధం వారి ఆరోగ్యాన్ని ఎలా ప్రభావితం చేస్తుందో జంటలు గుర్తుంచుకోవడం చాలా ముఖ్యం. ఆరోగ్యకరమైన అలవాట్లు, స్వీయ సంరక్షణకు ప్రాధాన్యత ఇవ్వడానికి చిన్న మార్పులు చేయడం ద్వారా బరువు పెరిగే సాధారణ ఉచ్చును నివారించవచ్చు. అయితే బరువు పెరగడం ఎందుకు జరుగుతుంది..? ఈ విషయం వెనుక ఉన్న కొన్ని కారణాలను పరిశీలిద్దాం. అనారోగ్యకరమైన అలవాట్లు: వివాహం తర్వాత మహిళలు బరువు పెరగడానికి ప్రధాన కారణాలలో ఒకటి కాలక్రమేణా అభివృద్ధి చెందగల అనారోగ్యకరమైన అలవాట్లు. మహిళలు పెళ్లికాక ముందు భాగస్వామిని ఆకర్షించడానికి వారు ఆరోగ్యంగా, ఆరోగ్యంగా ఉండటంపై ఎక్కువ దృష్టి పెట్టవచ్చు. అయితే, వారు పెళ్లి అయినా తర్వాత వారి రూపాన్ని కొనసాగించడానికి వారు తక్కువ ఆలోచన చేస్తారు. ఇది ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, క్రమం తప్పకుండా వ్యాయామం చేయడంలో లోపానికి దారితీస్తుంది. చివరికి బరువు పెరగడానికి దారితీస్తుంది. చాలా వివాహాలలో జంటలు తరచుగా కలిసి భోజనం పంచుకుంటారు. ఇది ఒక అద్భుతమైన బంధ అనుభవంగా ఉన్నప్పటికీ, ఇది అతిగా తినడానికి కూడా దారితీస్తుంది. ఒక భాగస్వామి అనారోగ్యకరమైన ఆహారంలో మునిగిపోయినప్పుడు, మరొకరు దీనిని అనుసరించే అవకాశం ఎక్కువగా ఉంటుంది. ఇది ఇద్దరు వ్యక్తులకు బరువు పెరగడానికి దోహదపడే అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లను సృష్టించవచ్చు. ఒత్తిడి, బిజీగా ఉండే ప్రణాళికలు: వివాహ బంధం అనేది కుటుంబాన్ని నిర్వహించడం, పిల్లలను పెంచడం వంటి అదనపు బాధ్యతల వల్ల ఒత్తిడి ఏర్పడుతుంది. ఇది తరచుగా తక్కువ ఆరోగ్యకరమైన, సౌకర్యవంతమైన భోజనాలపై ఆధారపడటానికి దారితీస్తుంది. అదనంగా, బిజీగా ఉండే షెడ్యూల్లు వ్యాయామం కోసం సమయాన్ని కనుగొనడం కష్టతరం చేస్తాయి. ఇది బరువు పెరుగుట సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది. వ్యక్తిగత సమయం లేకపోవడం: చివరగా, చాలా మంది మహిళలు వివాహం చేసుకున్న తర్వాత తమ వ్యక్తిగత సమయం తక్కువగా ఉందని తెలుసుకోవచ్చు. ఇది స్వీయ సంరక్షణ, వ్యాయామానికి ప్రాధాన్యత ఇవ్వడం సవాలుగా చేస్తుంది. ఇది బరువు పెరగడానికి దారితీస్తుంది. అదనంగా కొంతమంది మహిళలు తమ భాగస్వామి, కుటుంబ సభ్యులను జాగ్రత్తగా చూసుకోవడంపై ఎక్కువ దృష్టి పెట్టవచ్చు. ఈ ప్రక్రియలో వారి స్వంత ఆరోగ్యాన్ని నిర్లక్ష్యం చేయవచ్చు.

# ఎనర్జీని పెంచే బార్స్.. ఇంట్లోనే ఈజీగా చేయవచ్చు..



రోజంతా ఎనర్జిటిక్‌గా ఉండాలంటే అందుకు తగ్గట్టుగా ఆహారం తీసుకోవాలి. ఎనర్జీని పెంచే ఆహారాలు తీసుకోవడం వల్ల ఉల్లాసంగా, ఉత్సహంగా ఉంటారు. ఆఫీసు పనులు చేసేవారు, గట్టి పనులు చేసేవారు వీటిని తినడం వల్ల శరీరానికి శక్తి వస్తుంది. దీని వల్ల బలంగా, దృఢంగా ఉంటారు. అంతేకాకుండా పిల్లలకు కూడా ఈ ఎనర్జీ బార్స్ ఇవ్వడం వల్ల వారు కూడా యాక్టివ్‌గా ఉంటారు. ఎనర్జీని పెంచే బార్స్‌ని చాలా మంది బయట కొనుక్కుంటారు. దాని కంటే ఇంట్లోనే తయారు చేసుకుని తినడం వల్ల ఆరోగ్యానికి చాలా మంచిది. వీటితో శరీరానికి కావాల్సినంత ప్రోటీన్ కూడా లభిస్తుంది. ఉదయాన్నే తినడం వల్ల శరీరానికి కావాల్సిన అనేక పోషకాలు అందుతాయి. ఎనర్జీ బార్ తయారీకి కావాల్సిన పదార్థాలు: ఎండు ఖర్జూరం, బాదం, జీడిపప్పు, వాల్‌నట్స్, నువ్వులు, వేరుశనగ పప్పు, ఉప్పు లేని పిస్తా పప్పు, గుమ్మడి గింజలు, తేనె, యాలకుల పొడి, ఓట్స్. ఎనర్జీ బార్ తయారీ విధానం: ముందుగా ఎండు ఖర్జూరాన్ని శుభ్రంగా కడిగి.. వేడి నీటిలో నానబెట్టాలి. కనీసం గంట సేపు అయినా నానబెట్టాలి. ఇప్పుడు ఈ ఖర్జూరంలో విత్తనాలు తీసేసి.. మిక్సీ పట్టుకోవాలి. ఇప్పుడు ఒక కడాయి తీసుకోవాలి. ఇందులో ఒకదాని తర్వాత మరొకటి వేసి.. వేయిస్తూ ఉండాలి. కావాలి అనుకునేవారు ఎండు కొబ్బరి తురుమును కూడా వేయించి తీసుకోవచ్చు. ఇప్పుడు ఇవన్నీ ఒక పాత్రలోకి తీసుకోవాలి. ఆ తర్వాత ఇదే కడాయిలో చివరగా ఓట్స్ కూడా వేసి ఫ్రై చేయాలి. ఇప్పుడు వీటన్నింటినీ కలిపి మిక్సీ చేసుకోవాలి. ఆ తర్వాత ఒక కడాయి తీసుకుని ఇందులోనే ముద్దగా ఉన్న ఖర్జూరం వేసి నీరంతా ఇంకిపోయే వరకు చిక్కబడేలా వేయించాలి. నెక్ట్స్ ఇందులో డ్రైఫ్రూట్స్ పొడి, యాలకుల పొడి కూడా వేసి కలుపుకోవాలి. ఇప్పుడు స్టవ్ కట్టేసి.. తేనె వేసి మరోసారి అంతా కలుపుకోవాలి. ఆ తర్వాతే ఓట్స్ పొడి కూడా వేయాలి. ఇందులో పంచదార వేయాల్సిన పని లేదు. ఇప్పుడు ఈ మిశ్రమాన్ని అంతా ట్రైలోకి వేయాలి. కట్ చేసి.. పైన మూత పెట్టి.. గంటసేపు వరకు ఫ్రిజ్‌లో ఉంచాలి. అంతే బార్స్ తయారైనట్టే.

# ఈ పండ్లు తిన్నారంటే పింపుల్స్ రమ్మన్నా రావు..



పింపుల్స్ సమస్యలతో బాధ పడేవారు చాలా మంది ఉంటారు. ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నా కూడా మొటిమలు వస్తూ ఉంటాయి. ఇవి వచ్చాయంటే అంత తేలిగ్గా తగ్గవు. మొటిమలు వచ్చాక మచ్చలు కూడా పడుతూ ఉంటాయి.అందుకే చాలా మంది పింపుల్స్ సమస్యను తగ్గించుకునేందుకు చాలా ప్రయత్నాలు చేస్తూ ఉంటారు. ఈ పండ్లు తిన్నారంటే పింపుల్స్ రాకుండా చేసుకోవచ్చు.మొటిమలను తగ్గించే వాటిల్లో బెర్రీలు ఎంతో చక్కగా సహాయ పడతాయి. స్ట్రాబెర్రీలు, బ్లూ బెర్రీలు, రాస్ప్బెర్రీలు, బ్లాక్ బెర్రీల్లో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి మొటిమలను తగ్గించడంలో చక్కగా పని చేస్తాయి.యాపిల్ తినడం వల్ల కూడా మొటిమలను రాకుండా చేసుకోవచ్చు. మొటిమలతో బాధ పడేవారు యాపిల్‌ను మీ డైట్‌లో యాడ్ చేసుకోండి. ఇందులో ఫైబర్, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి చర్మాన్ని అందంగా ఉంచుతాయి. ఆరెంజ్ పండ్లు తినడం వల్ల కూడా పింపుల్స్ రాకుండా ఉంటాయి. ఇవి విటమిన్ సికి గొప్ప మూలం. ఇది మొటిమల వలన వచ్చే వాపును, మచ్చలను కూడా తగ్గిస్తుంది. ఇతర ఆరోగ్య ప్రయోజనాలు కూడా చాలానే ఉన్నాయి. పైనాపిల్ తినడం వల్ల కూడా మొటిమలు రాకుండా నియంత్రణ చేస్తుంది. ఇందులో బ్రోమెలైన్ ఉంటుంది. ఇది పింపుల్స్, వీటి నుంచి వచ్చే ఎరుపు, వాపులను తగ్గించడంలో సహాయ పడుతుంది.

# సంపూర్ణ ప్రోటీన్లు అందించే సోయాబీన్స్?




సోయాబీన్స్.. ఇందులోని పోషకాలు మాంసాహారానికి ప్రత్యామ్నాయంగా ఉపయోగపడతాయి. కొంతమంది వీటిని ఇష్టంగా తింటే.. మరికొందరు దీన్ని చూసి పారిపోతారు. కొందరికి సోయాబీన్స్ అంటే మహా ఇష్టం. అయితే మరికొందరు వీటిని చైనీస్ వంటకాల మాదిరి వండడానికి ఇష్టపడతారు. మాంసకృత్తులతో నిండిన ఇది అనేక పోషక ప్రయోజనాలను కూడా కలిగి ఉంటుంది. శాఖాహారమైనా లేదా మాంసాహారమైనా, సోయాబీన్స్ కలిపి వంట చేయడం వల్ల ఆహారం రుచి మారడమే కాకుండా ఆరోగ్యానికీ మేలు చేస్తుంది. సోయాబీన్‌లో విటమిన్ ఎ, విటమిన్ బి, విటమిన్ ఇ, ప్రోటీన్, రైబోఫ్లావిన్, కాల్షియం, ఫైబర్, థయామిన్, అమినో యాసిడ్, ఫోలిక్ యాసిడ్ వంటి మొదలైన పోషకాలు పుష్కలంగా ఉంటాయి. జీర్ణక్రియను మెరుగుపరచడం నుండి రక్తపోటును స్థిరంగా ఉంచడం వరకు ఎన్నో ప్రయోజనాలు అందిస్తుంది. ఎముకల ఆరోగ్యం: సోయాబీన్స్‌లో కాల్షియం పుష్కలంగా ఉంటుంది. ఇది ఎముకలు, దంతాల నిర్మాణాన్ని బలపరుస్తుంది. కాబట్టి ఈ ఆహారం ముఖ్యంగా మహిళలకు చాలా ముఖ్యమైనది. ఎందుకంటే 30 ఏళ్ల తర్వాత మహిళలు ఎముకల క్షీణత వంటి సమస్యలతో బాధపడుతుంటారు. ఇలాంటి వారు సోయాబీన్స్ తినడం మంచిది. రక్తపోటును నియంత్రించడం: రక్తపోటును నియంత్రించడంలో సోయాబీన్ చాలా ఉపయోగకరంగా ఉంటుంది. సోయాబీన్ పాలు కూడా ప్రయోజనకరంగా ఉంటాయి. సోయాబీన్‌లో కొన్ని ఆల్కలాయిడ్స్ ఉంటాయి. ఇవి రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. ఒత్తిడి ఎక్కువగా ఉంటే ప్రొటీన్ ఫుడ్ తినాలని నిపుణులు చెబుతుంటారు. అధిక ప్రోటీన్ ఒత్తిడిని నివారించడానికి ఉపయోగపడుతుంది. కాబట్టి సోయాబీన్స్ తినడం వల్ల ఈ సమస్య నుంచి ఉపశమనం పొందవచ్చు. బరువు తగ్గవచ్చు: సోయాబీన్‌లో అనేక ప్రయోజనకరమైన పదార్థాలు ఉంటాయి. ఇది సులభంగా బరువు తగ్గడానికి సహాయపడుతుంది. మాంసాహారానికి దూరంగా ఉండే వారు సోయాబీన్స్ ఉపయోగించి కట్లెట్స్, కబాబ్స్ తయారు చేసుకోవచ్చు. బ్రౌన్ రైస్, బిర్యానీ వంటి వంటకాలు సోయాబీన్స్‌తో కూడా తయారు చేసుకోవచ్చు. సోయాబీన్ కండరాల నిర్మాణానికి కూడా సహాయపడుతుంది.

## భోజనం తర్వాత ఈ చిన్నగింజలు కాస్త నోట్లో వేసుకుంటే చాలు!



రక్తంలో చక్కెరను నియంత్రించడానికి వాము సరైన ఔషధం అంటున్నారు ఆరోగ్య నిపుణులు. ఆహారం తీసుకున్న తర్వాత కాస్త వామును నోట్లో వేసుకోవటం వల్ల షుగర్ పెరగకుండా నియంత్రిస్తుందని అంటున్నారు. వాములో ప్రొటీన్, ఫ్యాట్, పీచు, కార్బోహైడ్రేట్ వంటి పోషకాలు ఉంటాయి. దీనిలోని పీచు శరీరంలోని బ్లడ్ షుగర్ నియంత్రణలో సహాయపడుతుంది. దీన్ని రెగ్యులర్‌గా భోజనం తర్వాత తీసుకోవడం వల్ల బ్లడ్ షుగర్ అదుపులో ఉంటుంది. మీ బ్లడ్ షుగర్ లెవెల్స్ నియంత్రించేందుకు వాము అద్భుతంగా ఉపయోగపడుతుంది. డయాబెటిస్ రోగులు వాము తీసుకోవడం వల్ల మంచి ఫలితాలు ఉంటాయి. ఎందుకంటే వాములో ఫైబర్ పుష్కలంగా ఉంటుంది. ఫైబర్ అనేది రక్తంలో షుగర్ స్థాయిని తగ్గించడంలో దోహదపడుతుంది. మీ డైట్‌లో వాము చేర్చడం ద్వారా మధుమేహాన్ని నియంత్రణలో ఉంచవచ్చు. వామును ప్రతిరోజూ మీ ఆహారంలో భాగంగా తీసుకోవటం వల్ల మంచి ఫలితం ఉంటుంది. ఒక కప్పు నీళ్లలో ఒక స్పూన్ వాము వేసి మరిగించాలి. ఆ తరువాత వడపోసి..భోజనం చేసిన 40 నిమిషాల తరువాత తీసుకోవాలి. ఇలా క్రమం తప్పకుండా చేయటం వల్ల బ్లడ్ షుగర్ అదుపులో ఉంటుంది. వామును ప్రతి రోజూ తీసుకోవడం వల్ల బరువు కూడా తగ్గుతారు. డయాబటిస్ ఉన్నప్పుడు బాడీ మెటబోలిజం సరిగ్గా ఉండదు. మెటబాలిజం వేగం తగ్గితే..బరువు పెరుగుతారు. ఇలాంటి పరిస్థితుల్లో వామును ఆహారంలో చేర్చుకోవటం వల్ల షుగర్ బాధితుల్లో మెటబోలిజం వృద్ధి చెందుతుంది.

# టమాటాను ముఖానికి ఉపయోగిస్తే చిన్నమచ్చ కూడా ఉండదు..



అందంగా, ఆకర్షణీయంగా కనిపించాలని ప్రతీ ఒక్కరూ కోరుకుంటారు. అందులోనూ అందం విషయంలో ఖచ్చితంగా ఉంటారు లేడీస్. ఎలాంటి మచ్చలు, మొటిమలు లేని చర్మం కావాలని అందరూ అనుకుంటారు. అలాగే చర్మం అందంగా మెరుస్తూ ఉంటే మరింత ఆకర్షణీయంగా కనిపిస్తారు. ముఖంపై మృత కణాలు పేరుకు పోవడం వలన కూడా ముఖం డల్‌గా మారుతుంది. అందాన్ని రెట్టింపు చేసే చిట్కాలు ఎన్నో తెలుసుకున్నాం. మంచి ఆహారం తీసుకోవడం వలన లోపలి నుంచి మరింత అందంగా కనిపిస్తారు. ముఖాన్ని అందంగా మార్చడంలో టమాటా ఎంతో చక్కగా పని చేస్తుంది. టమాటాతో చర్మంపై ఉండే టానింగ్, మృత కణాలు, మచ్చలు, మొటిమలు తగ్గించుకోవచ్చు. చర్మ సమస్యలను తొలగించడంలో టమాటాలు ఎంతో ఎఫెక్టీవ్‌గా పనిచేస్తాయి. ఎందుకంటే ఇందులో లైకోపీన్ పుష్కలంగా ఉంటుంది. ఇది చర్మ సమస్యలను తగ్గించడంలో ఎంతో చక్కగా పని చేస్తుంది.

టమాటా –కాఫీ స్క్రబ్: టమాటా, కాఫీ స్క్రబ్ చర్మ అందాన్ని పెంచడంలో ఎంతో చక్కగా సహాయ పడుతుంది. ఈ రెండింటి కాంబినేషన్ చర్మంపై ఉండే మృత కణాలను వదిలించుకోవడానికి చక్కగా యూజ్ అవుతుంది. ఈ ఫేస్ స్క్రబ్ ఎలా యూజ్ చేయాలో ఇప్పుడు చూద్దాం. సగం టమాటా ముక్క తీసుకుని దానిపై కొద్దిగా పంచదార, కాఫీ పౌడర్ వేయండి. ఇప్పుడు దీన్ని ముఖంపై సున్నితంగా రుద్దండి. ఈ స్క్రబ్ డెడ్ స్కిన్‌ను పూర్తిగా తొలగిస్తుంది. ఈ స్క్రబ్ టానింగ్, డార్క్ స్పాట్స్‌ను కూడా తగ్గించడానికి చాలా హెల్ప్ చేస్తుంది. అలాగే ఫేస్ కాంతివంతంగా మారుతుంది. ఇలా పావుగంట సేపు ఇలానే ఉంచండి. ఆ తర్వాత చల్లని నీటితో ముఖాన్ని కడగాలి.

టమాటా – అలోవెరా జెల్: టమాటా, అలోవెరా జెల్ కూడా చర్మ సమస్యలను తగ్గించడంలో ఎంతో చక్కగా పని చేస్తుంది. ముఖంపై ఉండే నల్ల మచ్చలు పోవడానికి ఈ జెల్ బాగా హెల్ప్ చేస్తుంది. సగం టమాటా ముక్క మీద ఒక స్పూన్ కలబంద జెల్ తీసుకోవాలి. దీన్ని ముఖానికి సున్నితంగా కొద్దిసేపు మర్దనా చేయాలి. ఇది ముఖంపై ఉండే మంటను తగ్గిస్తుంది. ముఖంపై మచ్చలను కూడా తగ్గిస్తుంది. అలాగే మీ చర్మాన్ని కూడా హైడ్రేట్ చేస్తుంది. ఈ ఫేస్ స్క్రబ్‌తో మంచి ఫలితాలు ఉంటాయి.

Edited, Printed, Published & Owned by Sri N.Chandra Shekhar, Printed at Laxmi Printers, D.No: 1-1-149/A, Gandhi Nagar, Kapra Mandal, Ecil, Medchal District. Telangana. Corporate Office : RamaKrishna Publications, D. No: 8-3-319/8,Flat No:304 Prasanthiram Towers, Ameerpet, Hyderabad, Telangana- 35, India. Website: www.subhatelangana.in Gmail : subhatelangana@gmail.com Cell : 7799911110